Follow: @ANNTELUGU
ANN తెలుగు
13-03-2026
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 75 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## హాలీవుడ్ హైదరాబాద్‌కు వచ్చినట్లే...

నెట్‌ఫ్లిక్స్ స్టూడియో ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

ఫోర్త్ సిటీలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు

పెట్టుబడి పెట్టే ప్రతి రూపాయికి రక్షణ కల్పిస్తామని హామీ

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ నగరం గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ ఇక్కడ ప్రారంభం కావడం అంటే హాలీవుడ్ హైదరాబాద్‌కు వచ్చినట్లే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం నగరంలో ఈ అత్యాధునిక వీఎఫ్ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్ హబ్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సినిమాల పట్ల తనకున్న మక్కువను పంచుకున్నారు. చిన్నతనం నుండి ఇప్పటి వరకు చిత్ర పరిశ్రమలో సాంకేతికంగా ఎన్నో మార్పులు వచ్చాయని, బాహుబలి, కల్కి, ట్రిబుల్ ఆర్, అరుంధతి

మిగతా 2లో

### టాప్ న్యూస్



## అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటాం

- ఇరాన్ సుప్రీం మొజ్తబా ఫస్ట్ వార్నింగ్

02



ముంబై కార్పొరేషన్ పై

## దీపిక పదుకొణె ఫైర్

- వాయు కాలుష్యంపై ఆగ్రహం

02



## 24 గంటల డెడ్ లైన్

- రష్మిక స్ట్రాంగ్ వార్నింగ్

02

# మళ్ళీ.. ఆ రోజులు

**గ్యాస్ కరవుతో వీధిన పడ్డ లక్షలాది మంది.. నిలిచిన ఉపాధి**



రెస్టారెంట్లు, హోటళ్లు మూతపడటంతో రోడ్డున పడిన లక్షలాది మంది కార్మికులు

సిలిండర్ కోసం వేలల్లో చెల్లింపు.. అయినా సామాన్యుడికి అందని ద్రాక్షే

ఆదాయం లేక, ఆకలితో అలమటిస్తున్న రోజువారీ కూలీలు

గ్యాస్ సిలిండర్‌ను మోదీ ఎత్తివచ్చే మార్ఫింగ్ ఫొటోతో జుమ్లాబలి అంటూ టీఎంసీ పోస్ట్

చమురు, ఎల్‌పీజీ సంక్షోభం లేదు : ప్రధాని మోదీ

**ఢిల్లీ, మహా :** ఇరాన్ యుద్ధం వల్ల భారత్‌లో గ్యాస్ కొరత ఏర్పడింది. ఈ ప్రభావం దేశంలోని పలు దేవాలయాలు, పెళ్లిళ్లపై పడింది. దీంతో శిర్డీలోని సాయిబాబా ఆలయ అధికారులు భక్తుల కోసం ప్రసాదం సిద్ధం చేయడంపై ఆందోళన చెందుతున్నారు. ఢిల్లీ, నోయిడా వంటి నగరాల్లో గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఒక్క హోటల్ రంగంలోనే వేల సంఖ్యలో రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. ఇందులో పనిచేసే వెయిటర్లు, క్లీనర్లు, వంట మనుషులు మళ్లీ తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. "కరోనా సమయంలో ఎలాగైతే పనిలేక ఇంటికి వెళ్ళామో.. ఇప్పుడు గ్యాస్ లేక మళ్లీ అదే పరిస్థితి వస్తోంది" అని నోయిడాలోని ఒక రెస్టారెంట్ కార్మికుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బెంగుళూరులో హోటల్స్ మూసివేశారు. ముంబై, చెన్నైలోనూ దీని ఎఫెక్ట్ కనిపిస్తోంది. హైదరాబాద్ లో అవకాశమున్న ఫేమస్ రెస్టారెంట్లు కట్టెల పొయ్యే బెటరంటున్నాయి. దీంతో లక్షలమంది ఉపాధి కోల్పోయిన పరిస్థితులు లాక్ డౌన్ నాటి సంక్షోభాన్ని గుర్తుకు తెస్తున్నాయని అంటున్నారు.

### ప్రభుత్వ జోక్యం కోసం ఎదురుచూపులు

ఉపాధి కోల్పోయిన లక్షలాది కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే రంగంలోకి దిగాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇంధన సరఫరాను పునరుద్ధరించకపోతే, ఈ సంక్షోభం మరిన్ని ప్రాణాలను, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్ లో గ్యాస్ సంక్షోభంపై కేంద్రం దృష్టి పెట్టినప్పటికీ అనుకున్నంత ఫలితాలు కనిపించక పోవడం ఆందోళనకరమైందని అంటున్నారు. గ్యాస్ వినియోగం, సరఫరా, ఉత్పత్తి తదితర అంశాలపై కేంద్రం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తే తప్పా ప్రస్తుత పరిస్థితి చక్కబడే అవకాశం లేదని పేర్కొంటున్నారు.




**సిలిండర్ రూ.4 వేలు**

- ఏజెన్సీల దగ్గర 'నో స్టాక్
- బ్లాక్‌లో ఇస్తే రూ.4,000 వరకు వసూలు
- గ్యాస్ భారం మోయలేక 'బావర్చి' సహా పలు హోటళ్లు మూత
- ఆలయాల్లో నిత్యాన్నదానంపై గ్యాస్ కొరత ఎఫెక్ట్

02

# అలా.. ముగిసింది



- బీఆర్ఎస్ కు సుప్రీంకోర్టు షాక్
- స్పీకర్ నిర్ణయమే ఫైనల్ అన్న సుప్రీం
- కేసును మూసి వేస్తున్నట్లు ప్రకటన

**ఢిల్లీ, మహా :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై సుప్రీం కోర్టు విచారణను ముగించింది. బీఆర్ఎస్ పార్టీ దాఖలు చేసిన న్యాయస్థానం తుది తీర్పును వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ డిస్పోజ్ చేసింది. ఈ కేసు విచారణ సమయంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి.. దాఖలైన పిటిషన్లపై స్పీకర్

మిగతా 2లో

# కవిత ఇంటికి సీబీఐ

*ఢిల్లీ లిక్కర్ కేసులో ట్విస్ట్.. నోటీసులు అందుకున్న భర్త అనిల్*

***ఈ నెల 16 న కోర్టు విచారణ ఉందని తెలిపిన అధికారులు***



**హైదరాబాద్, మహా :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తాజా పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడిని పెంచాయి. మాజీ ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కవిత నివాసం వద్ద గురువారం హైడ్రామా చోటు చేసుకుంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు ఆమెకు నోటీసులు అందజేశారు. బంజారాహిల్స్‌లో ఉన్న కల్వకుంట్ల కవిత నివాసానికి మధ్యాహ్నం సీబీఐ అధికారులు చేరుకున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన హైకోర్టులో దాఖలైన తాజా కౌంటర్ అఫిడవిట్‌పై వివరణ కోరుతూ కోర్టు జారీ చేసిన నోటీసులు అందజేయడమే అధికారుల ప్రధాన ఉద్దేశం. అయితే అధికారులు వెళ్లిన సమయంలో కవిత తన నివాసంలో అందుబాటులో లేరు. దీంతో సీబీఐ అధికారులు ఆ నోటీసులను కవిత భర్త అనిల్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు అనిల్ కుమార్‌తో మాట్లాడినట్టు తెలుస్తోంది. కవిత ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు వస్తారని అడిగారు.

మిగతా 2లో

## అల్లు వారి రేవంతన్న

- సంధ్య థియేటర్ తోపులాట నుండి.. సీఎం రేవంతన్న ప్రశంసల దాకా!
- ఆర్టీసీ క్రాస్ రోడ్స్ టు అల్లు సినిమాస్
- గిర్రున తిరిగిన కాలచక్రం
- తొక్కిసలాట.. అరెస్ట్.. అసెంబ్లీలో డైలాగ్ వార్.. గద్దర్ అవార్డులు.. నేడు అల్లు వారి అతిథి

ప్రత్యేక కథనం 4లో

## కోకాపేటలో అల్లు సినిమాస్

- ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నేను సూపర్ స్టార్ కృష్ణ ఫ్యాన్ ను
- అల్లు అర్జున్ హాలీవుడ్ స్థాయికి వెళ్ళాలి

02





# సిలిండర్ రూ.4 వేలు

- ఏజెన్సీల దగ్గర 'నో స్టాక్
- బ్లాక్‌లో ఇస్తే రూ.4,000 వరకు వసూలు
- గ్యాస్ భారం మోయలేక 'బావర్చి' సహా పలు హోటళ్లు మూత
- ఆలయాల్లో నిత్యాన్నదానంపై గ్యాస్ కొరత ఎఫెక్ట్

**హైదరాబాద్, మహా:** యుద్ధం ఎఫెక్ట్ అనేకరంగాలను అతలాకుతలం చేస్తోంది. గ్యాస్ కొరతను సాకుగా చూపి ఏజెన్సీలు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నాయి. అధికారికంగా బుక్ చేసుకున్న వారికి 'స్టాక్ లేదు' అని చెబుతూనే, రూ.3,500 నుంచి రూ.4,000 వరకు ముట్టజెప్పే వారికి గుట్టుచప్పుడు కాకుండా సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో, పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలోని సోలాపూర్ నుంచి కూడా సిలిండర్లను అక్రమంగా తరలించి మాదాపూర్ వంటి ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రముఖ హోటళ్లపై ప్రభావం**

వాణిజ్య సిలిండర్ల ధరలు ఆకాశాన్ని తాకడంతో చిన్న హోటళ్లు మూతపడుతుండగా, ఐకానిక్ హోటల్స్ కూడా చేతులెత్తేస్తున్నాయి. హైదరాబాద్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన బావర్చి హోటల్ బుధవారం మూతపడటం నగరంలో గ్యాస్ సంక్షోభానికి నిదర్శనంగా నిలిచింది. ఐటీసీ వంటి దిగ్గజ హోటల్ గ్రూపులు సైతం తమ ఆహార సేవలలో అంతరాయం కలగవచ్చని కస్టమర్లకు ముందే సమాచారం ఇస్తున్నాయి.

**ఆలయాల్లో 'నిత్యాన్నదానానికి' గండం**

ప్రముఖ దేవాలయాల్లో ప్రసాదాల తయారీ, అన్నదాన కార్యక్రమాలు ప్రశ్నార్థకంగా మారాయి. యాదగిరిగుట్ట: రోజుకు 5 వేల కిలోల గ్యాస్ అవసరమయ్యే ఈ ఆలయంలో కేవలం 4 రోజుల నిల్వలు మాత్రమే ఉన్నాయి. సికింద్రాబాద్: ఉజ్జయినీ మహంకాళి, గణేశ్ ఆలయాల్లో 23 రోజులకు మించి గ్యాస్ లేదు. ఈ విపత్కర పరిస్థితులపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు చమురు సంస్థలతో అత్యవసర సమీక్ష నిర్వహించి, సరఫరాలో ఆలయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# కోకాపేటలో అల్లు సినిమాస్

**ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. నేను సూపర్ స్టార్ కృష్ణ ఫ్యాన్ ను.. అల్లు అర్జున్ హాలీవుడ్ స్థాయికి వెళ్ళాలి**

**కోకాపేట, మహా :** కోకాపేటలో అల్లు సినిమాస్‌ను ఆసియాలోనే అతి పెద్ద డాల్బీ స్క్రీన్ కలిగిన మల్టీ ఫ్లెక్స్‌గా రూపొందించారు. అల్లు సినిమాస్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. రేవంత్‌రెడ్డికి సినీనటుడు అల్లు అర్జున్ స్వాగతం పలికారు. అల్లు సినిమాస్‌లో అల్లు రామలింగయ్య విగ్రహానికి సీఎం, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులు అర్పించారు. అల్లు సినిమాస్‌లో ఏర్పాట్లను సీఎంకు అల్లు అరవింద్, అల్లు అర్జున్ వివరించారు. అల్లు సినిమాస్‌లోని స్క్రీన్లను రేవంత్‌రెడ్డి పరిశీలించారు. డాల్బీ విజన్ స్క్రీన్‌లో అల్లు అర్జున్‌తో కలిసి సినిమా చూస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకులు, నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఫహీం ఖురేషీ, ఎఫ్ డీసీ ఛైర్మన్ దిల్ రాజు పలువురు పాల్గొన్నారు.

**నేను సూపర్ స్టార్ కృష్ణ ఫ్యాన్ ను - సీఎం**

తాను సూపర్ స్టార్ కృష్ణ ఫ్యాన్ ను అని, తాను వనపర్తిలో చదువుకునే సమయంలో సినిమాలు చూడటానికి లారీలో 100 కిలోమీటర్ల దూరంలోని కర్నూలుకు వెళ్లి సెకండ్ షో చూసి వచ్చేవాళ్లమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆ రోజుల్లో హైదరాబాద్ లేదా కర్నూలు వంటి నగరాల్లో మాత్రమే సినిమాలు విడుదలయ్యేవని నాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. వనపర్తి వంటి పట్టణాల్లో సినిమాలు విడుదలయ్యేవి కాదని, కాబట్టి మొదటి రోజునే సినిమా చూసేందుకు లారీల్లో కర్నూలు వెళ్లేవాళ్లమని అన్నారు. హైదరాబాద్‌లో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తాను కృష్ణ అభిమానిని అని తెలిపారు. సూపర్ స్టార్ కృష్ణ ఒక సంవత్సరంలో 15 నుంచి 16 సినిమాల్లో నటించిన రోజుల నుంచి ఈరోజుల్లో ఐదారేళ్లకు ఒక సినిమాలో నటించే హీరోలను చూస్తున్నామని అన్నారు. తెలుగు సినిమా పరిశ్రమ కోలీవుడ్ లేదా బాలీవుడ్‌తో పోటీపడకుండా, హాలీవుడ్‌తో పోటీ పడాలని అన్నారు. హాలీవుడ్ సినిమాలు కూడా ఇక్కడ ప్రదర్శించబడాలని ఆకాంక్షించారు. సినిమా పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. అల్లు అర్జున్ హాలీవుడ్‌లోనూ రాణించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. సాంకేతికంగా మన హాలీవుడ్‌తో పోటీపడాలని అన్నారు. అల్లు అరవింద్ ఎదిగిన తీరును చూసి స్వర్గంలో ఉన్న అల్లు రామలింగయ్య మనసు ఉప్పొంగిపోతుందని అన్నారు.

# 24 గంటల డెడ్ లైన్

**రష్మిక స్ట్రాంగ్ వార్నింగ్**

**మహా:** నటి రష్మిక మందన్న తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న అసత్య ప్రచారాల పట్ల సంచలన వార్నింగ్ ఇచ్చారు. నటుడు విజయ్ దేవరకొండతో వివాహం జరిగిన కొద్ది రోజులకే, ఎనిమిదేళ్ల క్రితం నాటి తన తల్లి ఆడియో క్లిప్‌ను కావాలనే బయటకు తీసి వివాదం సృష్టించడంపై ఆమె తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత ఎనిమిదేళ్లుగా తనపై జరుగుతున్న వ్యక్తిగత దాడులను మౌనంగా భరించానని, అయితే ఇప్పుడు తన కుటుంబాన్ని కూడా ఇందులోకి లాగడం అన్ని హద్దులను దాటడమేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరి అనుమతి లేకుండా ప్రైవేట్ సంభాషణలను రికార్డ్ చేయడం, అందులోని కొంత భాగాన్ని మాత్రమే వాడుకుని తప్పుడు అర్థాలు వచ్చేలా ప్రచారం చేయడం తన ప్రైవసీకి భంగం కలిగించడమేనని రష్మిక స్పష్టం చేశారు. వ్యూస్ కోసం ఒకరి గౌరవాన్ని తాకట్టు పెట్టే ధోరణిని ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. తప్పుడు వార్తలు, ఆ ఆడియో క్లిప్‌ను ప్రచారం చేస్తున్న వారికి ఆమె 24 గంటల సమయాన్ని నిర్దేశించారు. ఈ గడువులోగా వాటిని తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని సంబంధిత వ్యక్తులకు, మీడియా సంస్థలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు.

# అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటాం

**ఇరాన్ సుప్రీం మొజ్తబా ఫస్ట్ వార్నింగ్**

**మహా:** పశ్చిమాసియా ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలన్నింటినీ తక్షణమే మూసివేయాలని, లేకుంటే వాటిపై దాడులు చేస్తామని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ హెచ్చరించారు. మొట్టమొదటిసారిగా ఆయన స్పందించారు. ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై ముజ్తబా తన వైఖరిని స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లను కలిపే ఈ జలసంధి ద్వారానే ప్రపంచ చమురు రవాణాలో ఎక్కువ శాతం జరుగుతుంది. కనుక ఈ వ్యూహాత్మక మార్గాన్ని మూసివేయడాన్ని ఒక బలమైన అస్త్రంగా ఇరాన్ ఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యుద్ధంలో గాయపడిన వారికి ఉచితంగా చికిత్స అందించడంతో పాటు, నష్టపోయిన ప్రజలకు పరిహారం ఇస్తామని మొజ్తబా ఖమేనీ తెలిపారు. యెమెన్, ఇరాక్‌లోని సాయుధ దళాలు ఇరాన్‌కు మద్దతు తెలుపుతున్నాయని చెప్పారు. తమ అమరవీరులు చిందించిన రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామని మొజ్తబా తెలిపారు. యుద్ధంలో పోరాడుతున్న తమ సైనికులను మొజ్తబా అభినందించారు. నలువైపుల నుంచి శత్రువులు దాడులు చేస్తున్నా, సైనికులు అద్భుతంగా పోరాడుతున్నారని కొనియాడారు. అలాగే ఇరాన్ పౌరుల హత్యలను తాము చూస్తూ ఊరుకోమని, కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని కొత్త సుప్రీం లీడర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా యుద్ధం ప్రారంభమైన రోజున దక్షిణ ఇరాన్ నగరమైన మినాబ్‌లో ఒక బాలికల పాఠశాలపై జరిగిన క్షిపణి దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. "ఇరాన్ పౌరుల రక్తం చిందించిన వారిపై ప్రతీకారం తీర్చుకోవడానికి మేము వెనుకాడం" అని పేర్కొన్నారు.

# మహిళా భద్రత కోసం తెలంగాణ పోలీస్ చర్యలు అభినందనీయం

**జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహట్కర్**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ పలు చర్యలు చేపట్టిందని జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహట్కర్ అభినందించారు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్ర పోలీస్ శాఖ మహిళ మద్దతు కోసం చేపడుతున్న వివరాలను తెలుసుకొని ప్రశంసించారు. మహిళల ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తూ, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్యాయాలకు అడ్డుకట్ట వేయాలని ఆమె సూచించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం మేడ్చల్ మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'మహిళా జన సున్వాయి' (బహిరంగ విచారణ) కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన సుమారు 35 ఫిర్యాదులను ఆమె స్వయంగా పరిశీలించారు. ప్రధానంగా గృహహింస, వేధింపులు, కుటుంబ సభ్యులు వదిలివేయడం మరియు సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు బాధితుల నుంచి అందాయి. ప్రతి కేసును క్షుణ్ణంగా సమీక్షించిన చైర్‌పర్సన్, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎన్ సి ఆర్ బి 2023 గణాంకాల ఆధారంగా మహిళలపై




పెరుగుతున్న నేరాల సరళిని ఆమె చర్చించారు. దర్యాప్తు ప్రక్రియలో జాప్యం లేకుండా చూస్తూ, పోష్ చట్టం మరియు గృహహింస నిరోధక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. మహిళల భద్రత, గౌరవం విషయంలో రాజీ పడకూడదని, పోలీసు మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించి మహిళలకు అండగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి, సిఐడి అడిషనల్ డిజిపి చారు సిన్హా, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కె. అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, హైదరాబాద్ అడిషనల్ సిపి ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

- పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగంలోకి తీసుకురండి
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి సారించండి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మహా:** నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కను సన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోం శాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అదేవిధంగా నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుంది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.క్యూర్ , ప్యూర్ తో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రేర్ (రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ) సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. RARE రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ (MSME) లను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. ఎంఎస్ఎంఈ ల ద్వారా రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధితో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం ఎంఎస్ఎంఈ అని తెలిపారు. 41 జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఏఐ వినియోగాన్నిపెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సీవీ ఆనంద్, టీజీఐఐసీ ఎండీ శశాంక డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

# అలా.. ముగిసింది

- బీఆర్ఎస్ కు సుప్రీంకోర్టు షాక్
- స్పీకర్ నిర్ణయమే ఫైనల్ అన్న సుప్రీం
- కేసును మూసి వేస్తున్నట్లు ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే విచారణ చేసి.. తగిన నిర్ణయం తీసుకున్నారని కోర్టుకు తెలిపారు. పిటిషన్లను స్పీకర్ కార్యాలయం పరిష్కరించిందని ధర్మాసనానికి వెల్లడించారు. అభిషేక్ మను సింఘ్వీ వాదనలతో జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. స్పీకర్ ఇప్పటికే ఈ వ్యవహారంపై నిర్ణయం తీసుకున్నందున ఇక మీద ఈ పిటిషన్లపై విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని ముగించింది. అంతేకాదు రెండు రోజుల్లో తీర్పు కాపీలను ఫిర్యాదుదారులకు అసెంబ్లీ స్పీకర్ ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దానం నాగేందర్, కడియం శ్రీహరి పార్టీలు మారినట్టుగా ఆధారాలు లేవని స్పష్టం చేశారు. వీరిద్దరిపై అనర్హత పిటిషన్లను డిస్మిస్ చేశారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి ఫిరాయించారని నిరూపించడానికి ఎటువంటి ఆధారాలు లేవని తీర్పులో స్పీకర్ వెల్లడించారు. సుప్రీంకోర్టులో విచారణకు ముందే స్పీకర్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేల్లో తెల్లం వెంకట్‌రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, అరికెపూడి గాంధీ, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, సంజయ్‌కుమార్, దానం నాగేందర్, కడియం శ్రీహరి ఉన్నారు. తాజాగా సుప్రీం కోర్టు కూడా స్పీకర్ నిర్ణయం సరైందేనని పేర్కొంటూ కేసును మూసి వేస్తున్నట్లు ప్రకటించడంతో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలినట్లైంది.

# భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య

- ఎక్సైజ్ సీఐ సహా 11 మందిపై కేసు నమోదు
- నేరేడ్ మెట్ పోలీసుస్టేషన్ పరిధిలో ఘటన

**హైదరాబాద్, మహా :** కట్టుకున్న భార్య వేధింపులు భరించలేక, మనస్తాపానికి గురైన ఓ భర్త ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ లో చోటు చేసుకుంది. తన చావుకు భార్య వేధింపులే కారణమని బాధితుడు రాసిన సూసైడ్ నోట్ ఇప్పుడు కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే.. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన నగెల్లి శ్రీనివాస్ (41) నగరంలోని నేరేడ్మెట్ లక్ష్మీనగర్‌లో నివసిస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి 2012లో సట్లపల్లి జ్యోతితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. వివాహ సమయంలో జ్యోతి సాధారణ గృహిణి కాగా, భర్త శ్రీనివాస్ ప్రోత్సాహంతో ఆమె పోటీ పరీక్షలకు సిద్ధమై ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం ఆమె ఎక్సైజ్ సీఐ హోదాలో పనిచేస్తున్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత జ్యోతి ప్రవర్తనలో మార్పు వచ్చింది. భర్తను దూరం పెడుతూ శ్రీనివాస్, అతడి కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపులు, విడాకుల కేసులను బనాయించింది. దీంతో గత నాలుగు నెలలుగా శ్రీనివాస్ తన భార్యకు దూరంగా ఉంటూ మానసిక వేదనను అనుభవిస్తున్నాడు. కోర్టు కేసులు, భార్య వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు.

**సూసైడ్ నోట్ లభ్యం**

శ్రీనివాస్ సోదరుడు శివకృష్ణ ఇంటికి వచ్చి చూడగా.. శ్రీనివాస్ విగతజీవిగా కనిపించాడు. ఘటనా స్థలంలో పోలీసులకు ఒక సూసైడ్ నోట్ దొరికింది. అందులో 'నా భార్య పెట్టిన వేధింపులు, తప్పుడు కేసుల వల్లే నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అని శ్రీనివాస్ పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. మృతుడి సోదరుడు శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరేడ్ మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ జ్యోతితో పాటు ఆమెకు సహకరించిన మరో 10 మంది వ్యక్తులపై కేసులు బుక్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# ఖమ్మంలో మంగళ్య షాపింగ్ మాల్ క్రేజ్

- ఆధునిక వసతులతో.. 30వ బ్రాంచ్
- శ్రీలీల చేతులమీదుగా నేడు ప్రారంభోత్సవం

**ఖమ్మం, మహా :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో 29 బ్రాంచి లతో వస్త్ర ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మంగళ్య షాపింగ్ మాల్ ఖమ్మం నగరంలో కొత్త 30వ బ్రాంచ్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించబోతున్నదని సంస్థ డైరెక్టర్లు కాసం మల్లికార్జున్, కాసం నమశ్శివాయ, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ , పుల్లూరు అరుణ్ కుమార్ లు తెలిపారు. ప్రముఖ సినీ నటి అందాల తార శ్రీలీల చే శుక్రవారం జరగనున్న ఘన ప్రారంభోత్సవ కార్యక్రమానికి నగర ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని, కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి లేటెస్ట్ ఫ్యాషన్ కలెక్షన్లను వీక్షించాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

**ట్రెండ్స్ కు అనుగుణంగా..**

ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా, ఖమ్మం నగర ప్రజలకు ఇప్పటివరకు చూడని లేటెస్ట్ డిజైన్లు, విభిన్న మోడల్స్‌తో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పెళ్లిళ్లు, శుభకార్యాలు, పండుగలు వంటి ప్రత్యేక సందర్భాలకు అవసరమైన అన్ని రకాల వస్త్రాలను ఒకే చోట అందించేలా ఈ మాల్‌ను ఏర్పాటు చేశారు. పెళ్లికూతురు, పెళ్లికొడుకు కోసం ప్రత్యేకంగా రూపొందించిన వెడ్డింగ్ కలెక్షన్లు, మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం వేలాది రకాల ఆధునిక ఫ్యాషన్ దుస్తులు అం




దుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందించడం మంగళ్య షాపింగ్ మాల్ ప్రత్యేకతగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

**ఖమ్మం చరిత్రలోనే అత్యాధునికంగా..**

ఖమ్మం నగర చరిత్రలోనే అత్యాధునిక వసతులతో, విస్తృత స్థాయిలో ఏర్పాటైన ఈ షాపింగ్ మాల్ ప్రజలకు కొత్త షాపింగ్ అనుభూతిని అందించనుందని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవానికి ముందే నగరమంతా ఆకట్టుకునే విధంగా హోర్డింగ్స్, బ్యానర్లు, సోషల్ మీడియా ప్రచారంతో మంగళ్య షాపింగ్ మాల్ విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. దీంతో ఖమ్మం ప్రజల్లో ఈ మాల్ ప్రారంభంపై ఆసక్తి పెరిగింది.

# బుక్ చేసిన 60 గంటల్లోనే గ్యాస్ సిలిండర్ డెలివరీ

- కేంద్రం కీలక ప్రకటన
- హడావిడి బుకింగ్ చేసుకోవద్దని సూచన
- ఎల్ పీజీ ఉత్పత్తిని 25 శాతం పెంచినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ, మహా :** వంట గ్యాస్ సిలిండర్ల కొరతపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. సిలిండర్‌ను బుక్ చేసిన రెండ్రోజుల్లోనే డెలివరీ అవుతుందని తెలిపింది. ప్రభుత్వ చర్యలతో ఎల్ పీజీ ఉత్పత్తిని 25 శాతం పెంచినట్లు వెల్లడించింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంతో వంట గ్యాస్ సిలిండర్ల కొరతపై ఆందోళనలు నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో దేశంలోని ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది.

**భయాందోళనలకు గురి కావొద్దన్న కేంద్రం**

గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసిన రెండున్నర రోజుల్లోనే సిలిండర్ డెలివరీ అవుతుందని కేంద్రం పేర్కొంది. ప్రభుత్వ చర్యలతో ఎల్ పీజీ ఉత్పత్తిని 25 శాతానికి పెంచామని ప్రకటించింది. హార్మూజ్ జలసంధితో సంబంధం లేని రూట్ల ద్వారా చమురు దిగుమతి అవుతోందని వివరించింది. హార్మూజ్ నుంచి ఆగిపోయిన సప్లై కంటే ఎక్కువ చమురునే సేకరించామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఎల్పీజీ సిలిండర్ల విషయంలో ప్రజలెవరూ భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని కేంద్ర పెట్రోలియంశాఖ పేర్కొంది. రెండున్నర రోజుల సాధారణ డెలివరీ ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు తెలిపింది. భారత్ కు ముడి చమురు సరఫరాలు సురక్షితంగా ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ విలేకరులతో అన్నారు.ముడి చమురును హార్మూజ్ జలసంధి కాని మార్గాల నుంచి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. "కస్టమర్లు సిలిండర్లను హడావిడిగా బుక్ చేయాల్సిన అవసరం లేదు. భయాందోళనలకు గురి కావొద్దు. సాధారణంగానే బుకింగ్స్ అవుతాయి" అని సుజాతా శర్మ ప్రకటించారు. గ్యాస్ సిలిండర్ల మార్కెట్ విషయంలో బ్లాక్ మార్కెటింగ్ కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. "దాదాపు 40 దేశాల నుంచి భారత్ ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. చమురు మార్కెటింగ్ కంపెనీలు వివిధ వనరుల నుండి వివిధ ముడి సరుకులను సేకరించాయి. భారతదేశం యొక్క ముడి దిగుమతులలో 70 శాతం ఇప్పుడు హార్మూజ్ జలసంధి వెలుపల మార్గాల నుండి వస్తున్నాయి" అని సుజాతా శర్మ వివరించారు.

# కమర్షియల్ సిలెండర్ల కొరత వాస్తవం

- డొమెస్టిక్ సిలెండర్ల కొరత లేదు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నేడు అధికారులు, గ్యాస్ కంపనీలతో సమీక్షించనున్న మంత్రి

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని తెలిపారు. కమర్షియల్ సిలెండర్లు కేవలం 14 శాతమేనని తెలిపారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని అధికారులు తెలిపారన్నారు. వాస్తవానికి కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకు ఉన్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి వివరించారు. పూర్తి వివరాలతో రావాలని



ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. మరో వైపు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

# కవిత ఇంటికి సీబీఐ

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం ఈ కేసు ఢిల్లీ హైకోర్టు పరిధిలో ఉన్నందున, మార్చి 16వ తేదీన జరిగే తదుపరి విచారణ అత్యంత కీలకం కానుంది. క్లీన్‌చిట్ నిలబడుతుందా లేదా మళ్లీ విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందా అనేది వేచి చూడాలి.

**క్లీన్ చిట్ నుంచి హైకోర్టు వాల్ వరకు ఏం జరిగింది?**

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కవితకు సంబంధించి గతంలో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసును విచారించిన రౌస్ అవెన్యూ కోర్టు ఇటీవల ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ తీర్పు అరవింద్ కేజ్రీవాల్, కవితతోపాటు చాలా మంది నేతలకు ఊరట ఇచ్చింది. అయితే దర్యాప్తు సంస్థ ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది. కోర్టులో తాము సమర్పించిన ఆధారాలను ,కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకోవాలని సీబీఐ తన అప్పీల్‌లో పేర్కొంది. ఈ క్రమంలోనే దర్యాప్తును మరింత వేగవంతం చేసిన అధికారులు, హైకోర్టు ఆదేశాల మేరకు తాజాగా నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులను కవితకు సీబీఐ అధికారులు ఇచ్చారు.

# ముంబై కార్పొరేషన్ పై దీపిక పదుకొణె ఫైర్

**వాయు కాలుష్యంపై ఆగ్రహం**

**ముంబై, మహా:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో నానాటికీ పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణలో మహారాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందంటూ సోషల్ మీడియా వేదికగా అధికారుల తీరును ఆమె ప్రశ్నించారు. గురువారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ముంబై నగర వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) డేటాను దీపిక షేర్ చేశారు. నగరం సగటు ఏక్యూఐ 150గా ఉన్న చిత్రాన్ని పోస్ట్ చేస్తూ, "ఈ నగరం, ఇక్కడి పిల్లలు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు! ఇది ఎలా సమర్థనీయం!? దయచేసి సహాయం చేయండి" అని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ), దాని ఆరోగ్య విభాగాన్ని ట్యాగ్ చేశారు. 2024 సెప్టెంబరులో రణ్‌వీర్ సింగ్‌తో తనకు కుమార్తె 'దువా' జన్మించడంతో, ఒక తల్లిగా కూడా దీపిక ఈ అంశంపై గట్టిగా స్పందించారు.గత ఏడాదిగా ముంబైలో వాయు నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నగరవ్యాప్తంగా ఏక్యూఐ 230250 మధ్య నమోదవగా, బీకేసీ, ఘాట్‌కోపర్, ములుండ్ వంటి ప్రాంతాల్లో 290కి చేరింది. నగరంలో పెద్ద ఎత్తున జరుగుతున్న మౌలిక సదుపాయాలు, ఇతర నిర్మాణ ప్రాజెక్టుల నుంచి వెలువడుతున్న ధూళి కాలుష్యానికి ప్రధాన కారణంగా మారింది.

# కోకాపేటలో అల్లు సినిమాస్

(మొదటిపేజీ తరువాయి)

వంటి సినిమాలు తెలుగు సినిమా సత్తాను ప్రపంచానికి చాటాయని ప్రశంసించారు. ఒకప్పుడు చెన్నైకి పరిమితమైన తెలుగు చలనచిత్ర పరిశ్రమను లెజెండరీ నటులు ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ, ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద స్ట్రీమింగ్ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ తన రెండో భారతీయ కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. తన ప్రభుత్వం గతంలోనే చెప్పినట్లుగా మా దృష్టి హాలీవుడ్ స్థాయి ప్రమాణాలపైనే ఉందని, నెట్‌ఫ్లిక్స్ రాకతో ఆ కల నిజం కాబోతోందని ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫోర్త్ సిటీలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం వెల్లడించారు. నెట్‌ఫ్లిక్స్ తన కార్పొరేట్ కార్యాలయాన్ని కూడా ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని, అందుకు అవసరమైన భారీ ఆఫీస్ నిర్మాణానికి కావాల్సిన భూమిని కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆఫర్ ఇచ్చారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు ప్రభుత్వం నుండి పూర్తి సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రపంచంలోని టాప్ 500 కంపెనీలను తెలంగాణకు తీసుకురావడమే తమ లక్ష్యమని, ఇక్కడ పెట్టుబడి పెట్టే ప్రతి రూపాయికి రక్షణ ఉంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అంటేనే వ్యాపారం అని పేర్కొంటూ, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ మరియు కామిక్స్ రంగాల్లో హైదరాబాద్‌ను ప్రపంచ అగ్రగామిగా నిలుపుతామన్నారు.

# ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- అప్పుడే పేదల అభివృద్ధి సంక్షేమం సాధ్యం..
- మున్సిపల్ కౌన్సిలర్ల శిక్షణ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..
- రూ. 10,400 కోట్లతో విజయవాడ హైవే విస్తరణ పనులు..




**నల్గొండ టౌన్, మహా :** ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం నల్గొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులపై గురుతర బాధ్యత ఉందన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించినప్పుడే మన్ననలు లభిస్తాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని బడ్జెట్ సమావేశాలు నిర్వహించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**రూ. 10,400 కోట్లతో హైవే పనులు..**

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరిస్తూ.. రూ. 10,400 కోట్లతో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు టెండర్లు పిలిచినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే నల్గొండ నుంచి ధర్వేశిపురం వరకు రూ. 320 కోట్లతో రహదారి విస్తరణ, మాల్ హైదరాబాద్ లైన్ పనులు త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 99 రోజుల కార్యాచరణను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉగాది పండుగ నాటికి సామూహిక ఇందిరమ్మ గృహప్రవేశాల కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

**స్మార్ట్ సిటీగా నల్గొండ.**

నల్గొండను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ కౌన్సిలర్లు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పూర్తి అవగాహన పెంచుకున్నప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవో అశోక్ రెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

## నల్లగొండలో నకిలీ నర్సుల తయారీ కేంద్రాలుగా

# నర్సింగ్ కళాశాలలు..?

- ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లో 70 శాతం విద్యార్థులు కాలేజీలకు గైర్హాజరు..
- అటెండెన్స్, క్లినికల్స్, లేకుండానే పరీక్షలకు హాజరు..
- శిక్షణ 'సున్నా'..విద్యార్థులకు 'విచ్చలవిడి'సర్టిఫికెట్లు..
- క్లినికల్స్ లేవు అటెండెన్స్ అక్కర్లేదు 'డబ్బు' ముడితే చాలు.!
- నిబంధనలకు తిలోదకాలిస్తున్న యాజమాన్యాలు..

**నల్లగొండ, మహా బ్యూరో :** ఆసుపత్రిలో చేరిన రోగికి అమ్మలా పరిచర్యలు చేస్తూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ధైర్యాన్ని నింపే పవిత్రమైన 'నర్సింగ్' వృత్తి ఇప్పుడు నల్లగొండ జిల్లాలో వ్యాపార వస్తువుగా మారిపోయింది. మానవతా దృక్పథంతో సాగాల్సిన ఈ వృత్తి విద్యను కొన్ని ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలు కాసుల కక్కుర్తితో 'నకిలీ నర్సుల' తయారీ కేంద్రాలుగా మార్చేస్తున్నాయనే ఆరోపనలు వ్యక్తమవుతున్నాయి. తరగతులకు హాజరు కాకపోయినా ప్రాక్టికల్స్ ముట్టకపోయినా.. కేవలం అడిగినంత ఇచ్చుకుంటే చాలు చేతికి డిగ్రీ పట్టాలు వచ్చేస్తున్నాయి.



70 శాతం గైర్హాజరు.. అంతా 'అదృశ్య' విద్యార్థులే!

జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లో రికార్డుల్లో వందల మంది విద్యార్థులు కనిపిస్తున్నా తరగతి గదుల్లో మాత్రం ఆ సందడి కనిపించడం లేదు. బీఎస్సీ, జీఎన్ఎం కోర్సుల్లో చేరిన విద్యార్థుల్లో దాదాపు 70 శాతం మంది అసలు కళాశాల ముఖమే చూడటం లేదనేది సమాచారం. దేవరకొండ లో నర్సింగ్ కాలేజీ బిల్డింగ్... నల్గొండ హైదరాబాద్ రోడ్డులో వున్న ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో అడ్మిషన్లు.. విద్యార్థులకు క్లాసులు ఎక్కడ.? ఇలాంటి పరిస్థితితులలో నర్సింగ్ కళాశాల యాజమాన్యాలు ఉన్నాయి. వీరంతా పరీక్షల సమయంలో మాత్రమే ప్రత్యక్షమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం కనీసం 7580 శాతం హాజరు ఉండాల్సి ఉన్నా యాజమాన్యాలు భారీగా డబ్బులు వసూలు చేస్తూ తప్పుడు హాజరు రికార్డులను సృష్టిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**క్లినికల్ ట్రైనింగ్ కే 'గండి' కొడుతున్న విద్యార్థులు..**

నర్సింగ్ విద్యలో అత్యంత కీలకమైన భాగం క్లినికల్ శిక్షణ. విద్యార్థులు నిర్ణీత కాలం పాటు ఆసుపత్రుల్లో ఉండి రోగులకు ఇంజక్షన్లు ఇవ్వడం, సెలైన్ ఎక్కించడం, అత్యవసర చికిత్స అందించడంలో శిక్షణ పొందాలి.కానీ జిల్లాలోని కొన్ని కళాశాలలు ఈ నిబంధనను గాలికొదిలేశాయి.ఒక్క రోజూ ఆసుపత్రి గడప తొక్కని విద్యార్థులకు కూడా అన్ని రకాల నైపుణ్యాలు ఉన్నట్లు రికార్డులు సిద్ధం చేస్తున్నారు. ఈ విధంగా శిక్షణ లేకుండా బయటకు వస్తున్న నర్సుల వల్ల భవిష్యత్తులో రోగుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంతటి బాగోతం బహిరంగంగా సాగుతున్నా.. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం (KNRUHS), డీఎంఈ (DME), ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ అధికారులు మాత్రం మౌనం వహించడం వెనుక భారీగా 'ముడుపులు' ముట్టజెప్పుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం వెనుక తనిఖీల పేరిట వచ్చే పై అధికారులు లంచాలు తీసుకుని 'ఆల్ ఈజ్ వెల్' అంటూ సర్టిఫికేట్ ఇచ్చి వెళ్తున్నారని,అధికారులు, యాజమాన్యాలు కుమ్మక్కై సాగిస్తున్న ఈ దందాపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి నర్సింగ్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గృహ గ్యాస్ సరఫరాకు ఆటంకం లేదు..

- ఆందోళన వద్దు వినియోగదారులకు కలెక్టర్ భరోసా
- నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**నల్గొండ, మహా :** జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా మునుపటిలాగే సాఫీగా సాగుతుందని, నిల్వల కొరత ఏమీ లేదని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. పశ్చిమాసియా యుద్ధ పరిణామాల నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడుతుందనే ఆందోళన వినియోగదారుల్లో అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. గురువారం తన ఛాంబర్‌లో గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు, పౌరసరఫరాల అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ కంపెనీలు గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్‌ను సరఫరా చేస్తున్నాయని ఆయన వివరించారు.

**వాణిజ్య గ్యాస్‌కే స్వల్ప అంతరాయం..**

కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా కేవలం వాణిజ్య (కమర్షియల్) గ్యాస్ సరఫరాలో మాత్రమే కొంత ఇబ్బంది ఉందని, అయితే గృహ వినియోగ గ్యాస్ విషయంలో ఎలాంటి ఆటంకాలు లేవని కలెక్టర్ తెలిపారు. కమర్షియల్ గ్యాస్ కొరతను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. గృహ అవసరాల కోసం కేటాయించిన సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లిస్తే సహించేది లేదని జిల్లాలో ఇప్పటివరకు ఇలాంటి అక్రమాలకు పాల్పడిన 16 మందిని గుర్తించి వారిపై నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

**బుకింగ్ గడువులో మార్పులు..**

గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి గతంలో ఉన్న 21 రోజుల గడువును ఇటీవల 45 రోజులకు పెంచినట్లు కలెక్టర్ వివరించారు. సీనియారిటీ ప్రాతిపదికన ఏజెన్సీలు సిలిండర్లను సరఫరా చేస్తాయని ప్రజలు అనవసరంగా ముందే బుక్ చేసుకోవద్దని కోరారు. దళారులు లేదా ఏజెన్సీల మాటలు నమ్మి మోసపోవద్దని సర్వర్ సమస్యల వల్ల బుకింగ్‌లో తలెత్తిన చిన్నపాటి ఇబ్బందులను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. గ్యాస్ సరఫరాలో ఏవైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లోని టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1442 లేదా వాట్సాప్ నంబర్ 6305951279 కు ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.




# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో పారిశుద్ధ్య పనులు

**పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి సూచనలు**

**సత్తుపల్లి, మహా:** పంచాయతీరాజ్, గ్రామ అభివృద్ధి శాఖ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల పారిశుద్ధ్య పనులలో భాగంగా కిష్టారం గ్రామపంచాయతీ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు ఆధ్వర్యంలో కిష్టారం గ్రామంలోని పలు ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామం మధ్యన రైతులకు, వాహనదారులకు ఉపయోగపడే మట్టి రోడ్డులో బుధవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పనులు నిర్వహిస్తున్న కార్మికులకు సర్పంచ్ రాజేశ్వరి అప్పారావు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరుకుళ్ళ అప్పారావు, ఉప సర్పంచ్ శీలం నాగరాణి, గ్రామ కార్యదర్శి ఎం.వి రమణ, పంచాయతీ గుమస్తా శంకర్, పంచాయతీ ఎలక్ట్రిషన్ రహీం పాల్గొన్నారు.

## మిమ్ములనే నమ్ముకున్నాం..

# న్యాయం చేయండి..!

- రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్‌కు..
- కాంట్రాక్ట్ కార్మికుల వేతన పెంపు కోరుతూ వినతి..



**మణుగూరు, మహా :** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతన పెంపు సహా పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా కాంట్రాక్ట్ కార్మికులు రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు బి జనక్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారంతో మణుగూరు పర్యటనకు వచ్చిన జనక్ ప్రసాద్‌ను కాంట్రాక్ట్ కార్మికులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏరియా అధ్యక్షుడు అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ, సింగరేణి వ్యాప్తంగా సుమారు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కోల్ బెల్ట్ ప్రాంతంలో కార్మికులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి అభ్యర్థులను గెలిపించారని గుర్తు చేశారు. తక్కువ వేతనాలతో కాంట్రాక్ట్ కార్మికులు తమ జీవితాలను కొనసాగిస్తున్నారని, ఇప్పుడు కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తమరే మా సమస్యలకు న్యాయం చేస్తారని వేల కళ్లతో ఎదురు చూస్తున్నామని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు జారీ చేసిన జీవో నెం.22 లేదా హైపవర్ కమిటీ సిఫార్సుల ప్రకారం వేతనాలు అమలు చేయాలని కోరారు. అలాగే సంక్షేమ పథకాలలో భాగంగా ఈఎస్ఐ వైద్య సేవలు తక్షణమే అమలు చేయాలని, సీఎంపీఎఫ్‌ను పర్మినెంట్ కార్మికుల మాదిరిగా ఆన్‌లైన్ సేవల ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి క్యాంటీన్లలో టీ, టిఫిన్‌లకు బడ్జెట్ కేటాయించాలని, కార్మికులకు పని భద్రత కల్పించాలని కోరారు. అదేవిధంగా మణుగూరు ఏరియా సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఖాకీ యూనిఫామ్ అమలు చేయాలని, నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించి పీఎఫ్ అమలు చేయాలని కోరారు. వేసవి నేపథ్యంలో గనులు, విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు, ప్రైవేట్ వాహన డ్రైవర్లకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు కే గురుమూర్తి, యు శివరామకృష్ణ, టి రాములు, జి శ్రీనివాస్, రామారావు, గోవింద శ్రీను, ఈ పవన్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్టీయూసీ సమావేశంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన ఐఎన్టీయూసీ జనరల్ బాడీ సమావేశంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. కార్మికుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తాము కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. కార్మికుల అభ్యున్నతికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు తమ సహకారం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో యూనియన్ నాయకులు కార్మికుల సంక్షేమం సింగరేణి సంస్థ సంరక్షణకు చేపట్టవలసిన అంశాలపై చర్చించారు. యూనియన్ లో చేరిన పలువురు కార్మికులకు యూనియన్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును, యూనియన్ రాష్ట్ర, కేంద్ర కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో నాయకులు జనక్ ప్రసాద్, నరసింహ రెడ్డి, ధర్మపురి, త్యాగరాజన్, శంకర్ రావు, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, కట్టు మల్లారం సర్పంచ్ జగిడి ప్రసాద్, కూనవరం సర్పంచ్ ఎనిక శ్వేత, కూనవరం ఉపసర్పంచ్ కోటుం మనోజ్ కుమార్, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, విప్పల సింగారం ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్య, వార్డు సభ్యుడు బర్ల శ్వేతన్, 14 టైర్ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి

# ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**డీఎస్పీలు రవీందర్ రెడ్డి, పుష్పన్ కుమార్**



**పినపాక, మహా:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డ్రగ్స్ రహిత తెలంగాణ, డ్రగ్స్ రహిత జనరేషన్, అనే బృహత్తర కార్యక్రమానికి తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ ని పూర్తిగా నిర్మూలించేందుకు అందరం కృషి చేయాలని మణుగూరు డిఎస్పీ వంగా రవీందర్ రెడ్డి, ఈగల్ ఫోర్స్ డిఎస్పీ పుష్పన్ కుమార్ లు అన్నారు. గురువారం పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం, పినపాక, జానంపేట, దుగినేపల్లి గ్రామాలలో ఏడూళ్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు ఎస్సై సురేష్ ల ఆధ్వర్యంలో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించి, విద్యార్థులు యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మణుగూరు డిఎస్పీ వంగా రవీందర్ రెడ్డి, ఈగల్ ఫోర్స్ డిఎస్పీ పుష్పన్ కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్టు వారు తెలిపారు. డ్రగ్స్ వినియోగం వలన ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం, భవిష్యత్తు దెబ్బతింటాయని, యువత డ్రగ్స్ కు మరియు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్ మాఫియా సిగిరెట్లు, చాక్లెట్ల రూపంలో విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకొని మత్తు పదార్థాలు అలవాటు చేసి వారిని తమ బానిసలుగా చేసుకుంటారని, వీటికి యువత విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలు వాడటం వలన మహిళలపై అఘాయిత్యాలు హత్యలు వంటి కేసులు పెరుగుతున్నాయని వీటిని నిర్మూలించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. మీ సమీప ప్రాంతాలలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన డ్రగ్స్ వినియోగిస్తున్న సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలని 1908 వంటి హెల్ప్ లైన్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు. ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈగల్ ఫోర్స్ అనే ప్రత్యేక పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధిక మొత్తంలో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకోవడం జరిగిందని తెలిపారు. అక్రమంగా గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేస్తే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడమే కాకుండా వారి ఆస్తులను కూడా జప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. పిల్లల భద్రత, మహిళలపై వేధింపులు, మానవ అక్రమ రవాణా, సైబర్ మోసాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించి, మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఏడిఏ తాతారావు, మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి, పినపాక తాసిల్దార్ గోంది గోపాలకృష్ణ, ఫారెస్ట్ డిఆర్ఓ వెంకటేశ్వర రావు. ఎంఈఓ నాగయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు సంఘం చేతకానితనమే సింగరేణికి ఈ దుస్థితి..

- కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్..
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, మహా :** సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం నిర్లక్ష్యం, చేతకానితనమే సింగరేణి సంస్థలో ప్రస్తుతం ఏర్పడిన దుస్థితికి ప్రధాన కారణమని కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, కార్మిక సంఘాల నాయకుడు బి జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మణుగూరులో జరిగిన ఐఎన్ టియుసి జనరల్ బాడీ ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మరో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం పెర్క్స్‌పై ఆదాయపన్ను మాఫీ, కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు, మెడికల్ బోర్డు పునరుద్ధరణ వంటి కీలక అంశాలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. కార్మిక సంఘాల జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి సంజీవ రెడ్డి నాయకత్వంలో ఈ సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందని చెప్పారు. రాజకీయ ప్రయోజనాలకే పరిమితమైన గుర్తింపు సంఘం సింగరేణిలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండేళ్లు పూర్తయినా కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రత్యర్థి సంఘం రాజకీయ ప్రయోజనాలకే పరిమితమైందని విమర్శించారు. గుర్తింపు సంఘంగా పూర్తిగా విఫలమైన వారు ఇప్పుడు ధర్నాలు, దీక్షల పేరుతో కార్మికులను మోసం చేయడానికి కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో అక్రమ పొత్తులు పెట్టుకోవడం, స్ట్రక్చర్ సమావేశాన్ని బహిష్కరించడం కార్మిక సంఘం బాధ్యతలకు విరుద్ధమన్నారు. ప్రాతినిధ్య సంఘం చొరవతోనే మళ్లీ సమావేశం ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుంటూ అదే పార్టీని విమర్శించడం సరికాదని వ్యాఖ్యానించారు. కార్మికుల కోసం పలు నిర్ణయాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లతో చర్చించి సింగరేణి కార్మికుల సంక్షేమానికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. అందులో భాగంగా ఉద్యోగాల వయోపరిమితిని 35 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలకు పెంచడం, కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అమలు, ఒక కోటి రూపాయల ప్రమాద బీమా, అత్యాధునిక వైద్యశాల నిర్మాణం, నైని బొగ్గు గని ఉత్పత్తి ప్రారంభం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.

# బీటెక్ విద్యార్థిని అకాల మృతి..

**చాకలి ఐలమ్మ నగర్‌లో విషాదం..**



**మణుగూరు, మహా :** నిరుపేద రిక్షా కార్మికుడి కుటుంబంలో జన్మించి ఆర్థిక కష్టాల మధ్య చదువులో ప్రతిభ చూపిన యువ విద్యార్థిని అకాల మరణం ఐలమ్మ నగర్‌లో విషాదాన్ని మిగిల్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చాకలి ఐలమ్మ నగర్‌కు చెందిన రాపర్తి సైదులు కుమార్తె రాపర్తి అనుష (20) హఠాత్తుగా మృతి చెందడం విషాదకరం. ఆమె మృతి కుటుంబ సభ్యులతో పాటు తోటి విద్యార్థులు, స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. అనుష చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ అనేక విద్యా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని పలుమార్లు అవార్డులు అందుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె తండ్రి సైదులు రిక్షా కార్మికుడిగా కుటుంబాన్ని పోషించేవారు. కాగా గత సంవత్సరం ఆయన మరణించడంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. అయినప్పటికీ పట్టుదలతో చదువును కొనసాగించిన అనుష, హైదరాబాద్‌లోని జేఎన్టీయూ హెచ్ పరిధిలోని కాలేజీలో సీటు సాధించి ప్రస్తుతం బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. అనుష కొద్ది రోజులుగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ గురువారం ఉదయం హఠాత్తుగా మరణించడం కుటుంబ సభ్యులను శోకసంద్రంలో ముంచెత్తింది. ఆమె మృతిపై బంధువులు, స్నేహితులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళులు అర్పించారు.తన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులు, స్నేహితులు భగవంతుని ప్రార్థిస్తున్నారు.

# దుమ్ముగూడెం ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంప్

**మహా దుమ్ముగూడెం:** ప్రభుత్వం చేపట్టిన వందరోజుల ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గురువారం స్పెషలిస్ట్ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీధర్ ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్పెషలిస్ట్ వైద్యులను గ్రామాలకు పంపిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సమస్యలకు చికిత్స పొందాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రుక్మాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 175 మంది వివిధ ఆరోగ్య సమస్యలతో హాజరయ్యారు. 44 మందికి రక్త పరీక్షలు చేసి క్యాంపుకు వచ్చిన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిద్ధిక్ జనరల్ మెడిసిన్, డాక్టర్ ఆమని ఆర్థోపెడిక్, డాక్టర్ సింధూ రెడ్డి గైనకాలజిస్ట్, డాక్టర్ నాగజ్యోతి అత్తమాలజిస్ట్, డాక్టర్ యుగంధర్ డెంటల్, డాక్టర్ వినోద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



# వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతపై బీఆర్ఎస్ ఆగ్రహం..

- బాధితులకు వెంటనే న్యాయం చేయాలి
- జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రేగా డిమాండ్

**మణుగూరు, మహా :** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదల ఇళ్లను కూల్చివేసిన ఘటనపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తీవ్రంగా మండిపడ్డారు. హనుమాన్ ఫంక్షన్ హాల్ లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేదల ఇళ్లను కూల్చివేసి కుటుంబాలను రోడ్డున పడేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరాటం వల్లే ప్రభుత్వం దిగివచ్చి స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పేదలపై ఈ విధంగా అన్యాయం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వభావాన్ని బయటపెడుతుందని విమర్శించారు. వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు తక్షణమే పునరావాసం కల్పించి పూర్తి న్యాయం చేయాలని ఆయన కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోషం నరసింహారావు, కుర్రి నాగేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









# అల్లు వారి రేవంతన్న

## సంధ్య థియేటర్ తోపులాట నుండి.. సీఎం రేవంతన్న ప్రశంసల దాకా!

### ఆర్టీసీ క్రాస్ రోడ్స్ టు అల్లు సినిమాస్.. గిర్రున తిరిగిన కాలచక్రం..

### తొక్కిసలాట.. అరెస్ట్.. అసెంబ్లీలో డైలాగ్ వార్.. గద్దర్ అవార్డులు.. నేడు అల్లు వారి అతిథి




(**మహా ప్రత్యేకం**) కాలచక్రం ఎపుడూ ఒకేలా ఉండదు. అది గిర్రున తిరుగుతుంది. నిన్నటి వివాదం నేటి విజయానికి పునాది కావచ్చు.. నిన్నటి దూరం నేటి సాన్నిహిత్యానికి దారి తీయవచ్చు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ విషయంలో ఇప్పుడు ఇదే జరుగుతోంది. సరిగ్గా ఏడాది కాలంలో 'పుష్ప' వేదికపై జరిగిన ఒక చిన్న పొరపాటు నుండి, నేడు 'అల్లు సినిమాస్' సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పంచుకున్న ఆత్మీయత వరకు.. ఈ ప్రయాణం ఒక వెండితెర కావ్యంలా సాగింది.

**ఆనాడు.. ఒక చిన్న విస్మృతి.. ఒక పెద్ద చర్చ**

కొన్ని నెలల క్రితం 'పుష్ప' చిత్ర వేదికపై అల్లు అర్జున్ ప్రసంగిస్తూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి పేరును ప్రస్తావించడంలో జరిగిన చిన్న పొరపాటు సోషల్ మీడియాలో పెను తుఫానునే సృష్టించింది. అది ఉద్దేశపూర్వకమా లేక కాకతాళీయమా అన్న చర్చలు నడిచాయి. ఆ తర్వాత సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన, పోలీసుల విచారణ బన్నీ అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. ప్రభుత్వం బన్నీ మధ్య 'గ్యాప్' పెరిగిందన్న చర్చ సర్వత్రా జరిగింది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి అభిమానులు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత అల్లు అర్జున్ అరెస్ట్ దేశవ్యాప్త దుమారం రేపింది. అసెంబ్లీలో చర్చ కూడా జరిగింది. ముఖ్యమంత్రి సినిమా పరిశ్రమపై కక్ష పెంచుకున్నారంటూ విపక్షాలు విమర్శలు చేశాయి. కట్ చేస్తే.. ఇపుడు ఆ గ్యాప్ ను ఇరువైపులా ఫిల్ చేసుకోవడంతో పాటు వీరంత ఆత్మీయులు పరిశ్రమలో ఎవరూ లేరన్నట్లుగా మారింది.

**గద్దర్ అవార్డుతో మొదలైన మార్పు**

కాలం తన కథను తానే రాసుకుంటుంది. గద్దర్ అవార్డుల వేదికపై జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ ఎంపికవ్వడం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆ పురస్కారాన్ని అందుకోవడం ఒక కీలక మలుపు. అక్కడ మొదలైన సాన్నిహిత్యం నేడు 'అల్లు సినిమాస్' ప్రారంభోత్సవం నాటికి ఒక దృఢమైన బంధంగా మారింది.

**అల్లు సినిమాస్ వేదికపై 'రేవంతన్న' సందడి**

నార్సింగిలో అత్యాధునిక సాంకేతికతతో నిర్మించిన 'అల్లు సినిమాస్'ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించడం విశేషం. ఈ వేదికపై అల్లు అర్జున్ మాట్లాడుతూ.. అత్యంత ఆత్మీయంగా "రేవంతన్న" అని సంబోధించడం రేవంత్ అభిమానులను సంతోషపరచగా, అటు అల్లు అర్జున్ అభిమానులు కూడా ఆశ్చర్యానికి, సంతోషానికి గురయ్యారు. "రేవంత్ రెడ్డి గారు వారానికి 14 రోజులు పనిచేసే సీఎం" అంటూ అల్లు అరవింద్ చేసిన ప్రశంసలు.. "బన్నీ హాలీవుడ్ స్థాయికి ఎదగాలి" అని సీఎం ఆకాంక్షించడం.. ఈ మాటలు వింటుంటే, పాత గాయాలు మాసిపోయి ఒక కొత్త స్నేహం చిగురించిందని స్పష్టమవుతోంది.

**ఓర్పు - నేర్పు: అల్లు అర్జున్ నేర్పిన పాఠం**

కెరీర్‌లో అయినా, వ్యక్తిగత జీవితంలో అయినా అపార్థాలు రావడం సహజం. కానీ వాటిని అధిగమించేందుకు కావాల్సింది 'ఓర్పు'. ఎదురుదాడి చేయకుండా, సమయం కోసం వేచి చూస్తూ, తన పనితోనే సమాధానం చెప్పిన అల్లు అర్జున్ తీరు నేటి యువతకు ఒక పాఠం. సంధ్య థియేటర్ వద్ద కటౌట్లకు పాలభిషేకలు చేసే స్థాయి నుండి.. సొంత సినిమా హాల్స్ నిర్మించి రాష్ట్ర అధినేతతో ప్రశంసలు అందుకునే స్థాయికి చేరడం అల్లు అర్జున్ కష్టానికి, క్రేజ్‌కు నిదర్శనం. హాలీవుడ్ లో రాణించే సామర్ధ్యమున్న హీరోగా.. నేరుగా ముఖ్యమంత్రే ప్రశంసలు కురిపించడం అల్లు అర్జున్ హార్డ్ వర్క్ కు, నిబద్దతకు దక్కిన ప్రశంసగా భావించాలి.

## టెలిగ్రామ్ పైరసీపై కేంద్రం కన్నెర్ర

### 3 గంటల్లో 3,000 ఛానల్స్ క్లోజ్ చేయాలని ఆదేశం




నిన్నటివరకు ఏ సినిమా కావాలన్నా టెలిగ్రామ్‌లో వెతుక్కునే వారికి ఇప్పుడు పెద్ద షాక్ తగలనుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ (MIB) ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఓటీటీ సంస్థలు, సినిమా నిర్మాతల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఏం జరిగింది?**

కేంద్ర ప్రభుత్వం మార్చి 11న టెలిగ్రామ్‌కు ఒక నోటీసు పంపింది. ఇందులో 120 పేజీల అనుబంధం (Annexure) ఉంది. అందులో పైరసీకి పాల్పడుతున్న ఛానళ్ల లింకులు, పేర్లు, అవి పంచుతున్న సినిమాల వివరాలను ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. నోటీసు అందిన 3 గంటల్లోగా ఆ లింకులన్నింటినీ తొలగించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

**ఎందుకీ కఠిన నిర్ణయం?**

రెండో స్థానంలో భారత్: ప్రపంచవ్యాప్తంగా పైరసీని ఎక్కువగా చూస్తున్న దేశాల్లో అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉంది. 2024 నివేదిక ప్రకారం భారతీయులు పైరసీ వెబ్‌సైట్లను ఏకంగా 1,756 కోట్ల సార్లు సందర్శించారు.

**కొత్త చట్టాలు**

ఫిబ్రవరి 20, 2026 నుంచి అమలులోకి వచ్చిన కొత్త ఐటీ నిబంధనల ప్రకారం.. అక్రమ కంటెంట్‌ను తొలగించడానికి కంపెనీలకు ఇచ్చే సమయాన్ని ప్రభుత్వం బాగా తగ్గించింది.

**జవాబుదారీతనం**

ఒకవేళ టెలిగ్రామ్ ఈ ఆదేశాలను పాటించకపోతే, వినియోగదారులు పెట్టే పోస్టులకు ఆ సంస్థే బాధ్యత వహించాల్సి ఉంటుంది (Safe Harbour రక్షణ కోల్పోతుంది).

**సామాన్యులకు ఇది ఎలా వర్తిస్తుంది?**

ఈ నిర్ణయం వల్ల పైరసీ ఛానల్స్ నడిపే వారికి మాత్రమే కాదు, వాటిలో కంటెంట్ చూసే వారికి కూడా ఇబ్బందులు తప్పవు. ఛానల్స్ ఆగిపోవడం వల్ల మీరు డౌన్లోడ్ చేసుకున్న లేదా సేవ్ చేసుకున్న వీడియోలు కనిపించకుండా పోవచ్చు. సినిమా ఇండస్ట్రీని కాపాడుకోవడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పరిశ్రమకు ఊరటనివ్వనుంది.

**తరచుగా అడిగే ప్రశ్నలు (FAQs)**

**1. టెలిగ్రామ్ ఈ ఛానళ్లను తొలగించకపోతే ఏమవుతుంది?**

ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే, టెలిగ్రామ్ తన 'సేఫ్ హార్బర్' హోదాను కోల్పోతుంది. అంటే, ఆ యాప్‌లో జరిగే నేరాలు లేదా పైరసీకి ఆ సంస్థే బాధ్యత వహించి, భారీ జరిమానాలు లేదా కోర్టు కేసులను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

**2. 3 గంటల సమయం మాత్రమే ఎందుకు ఇచ్చారు?**

పైరసీ అనేది చాలా వేగంగా వ్యాపిస్తుంది. ఒక్కసారి సినిమా లింక్ వైరల్ అయితే నిర్మాతలు కోట్లలో నష్టపోతారు. అందుకే వేగంగా స్పందించాలని ప్రభుత్వం 2026 కొత్త నిబంధనలను రూపొందించింది.

**3. కేవలం సినిమాలేనా, ఇతర కంటెంట్ కూడా ఉందా?**

లేదు, సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లు, డబ్బులు పెట్టి వినే ఆడియో పుస్తకాలు (Audiobooks) కూడా పైరసీ లింకుల్లో ఉన్నందున వాటన్నింటినీ తొలగిస్తున్నారు.

## మీ గ్యాస్ సిలిండర్ ఎక్కువ రోజులు వచ్చేందుకు

# సింపుల్ చిట్కాలు!



ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎల్పీజీ కొరత గురించి ఆందోళన నెలకొన్నది. ఇప్పటికే హోటల్స్ అసోసియేషన్ ప్రభుత్వాలకు లేఖలు రాస్తున్నాయి. హోటళ్లు మూసివేసే పరిస్థితి ఏర్పడింది. చాలా వరకు హోటళ్లలో మెనూలో కొన్ని ఐటమ్స్ తగ్గించాయి. గృహవినియోగ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.60, కమర్షియల్ సిలిండర్‌పై రూ.115 వరకు ధరలు పెరిగాయి. అయితే ఇంట్లోని మీ సిలిండర్ ఎక్కువ కాలం వచ్చేందుకు కొన్ని చిట్కాలు పాటించాలి. అనేక నగరాలు వాణిజ్య సిలిండర్ల కొరతన ఎదుర్కొంటున్నాయి. గృహిణులు తమ వద్ద ఉన్న ఎల్పీజీ సిలిండర్ల వినియోగాన్ని ఎలా పెంచుకోవాలో ఆందోళన చెందుతున్నారు. మీ సిలిండర్ ఎక్కువ రోజులు వచ్చేందుకు మీకు సహాయపడే కొన్ని చిట్కాలు :

**ప్రెజర్ కుకింగ్**

సాంప్రదాయ వంట పద్ధతులతో పోలిస్తే, ప్రెజర్ కుకింగ్ వంట సమయం, ఇంధనం రెండింటినీ ఆదా చేస్తుంది. పెట్రోలియం కన్జర్వేషన్ రీసెర్చ్ అసోసియేషన్ (PCRA) ప్రకారం.. ప్రెజర్ కుకింగ్ బియ్యంపై 20 శాతం, నానబెట్టిన పప్పులపై 46 శాతం, కూరగాయలపై 5070 శాతం, మాంసంపై 41.5 శాతం గ్యాస్ ఆదా చేస్తుంది.

**తక్కువ వేడి మీద ఉడికించాలి**

మంట ఎక్కువగా ఉన్నప్పుడు గ్యాస్ వేడి రూపంలో వృథా అవుతుంది. కుండ లేదా పాన్ ఉపరితలం నుండి వెలువడే అధిక వేడి చుట్టుపక్కల గాలిని గ్రహిస్తుంది. మరిగే స్థానానికి చేరుకున్న తర్వాత వేడిని తగ్గించడం వల్ల 25 శాతం వరకు గ్యాస్ ఆదా చేయవచ్చు.

**వంట చేయడానికి ముందు నానబెట్టండి**

పప్పులు, బియ్యం, ఇతర ధాన్యాలను నానబెట్టడం వల్ల ఇంధనం ఆదా అవుతుంది. ఆహారం ఇప్పటికే నీటిని పీల్చుకున్నందున, వంట సమయంలో ఆవిరైపోయే నీటి పరిమాణం తగ్గుతుంది. నానబెట్టడం వల్ల గ్యాస్ ఆదా కావడమే కాకుండా మీ ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది.

**వెడల్పాటి కుండలలో వంట చేయడం**

వెడల్పాటి కుండలలో వంట చేయడం వల్ల ఇంధనం ఆదా అవుతుంది ఎందుకంటే బర్నర్ నుండి వచ్చే మంట కుండ ఉపరితలంపై కేంద్రీకృతమై ఉంటుంది. వృధా కాకుండా నిరోధిస్తుంది. వెడల్పాటి కుండలు గ్యాస్‌ను ఆదా చేయడమే కాకుండా త్వరగా, సమానంగా వంట చేయడానికి కూడా సహాయపడతాయి.

**సరైన మొత్తంలో నీరు**

ఎక్కువ నీరు ఆవిరైపోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇది గ్యాస్ వినియోగాన్ని పెంచుతుంది. వంట పాత్రల్లో నీటిని ఎక్కువగా నింపడం వల్ల ఆహారం ఎక్కువగా ఉడికిపోతుంది. గ్యాస్, ఆహారం మీద దీని ప్రభావం ఉంటుంది.

**చిన్న బర్నర్‌ను ఉపయోగించండి**

చిన్న బర్నర్‌లు పెద్ద వాటి కంటే 610 శాతం తక్కువ గ్యాస్ ఉపయోగిస్తాయి. చిన్న బర్నర్ వ్యాసార్థంతో చుట్టుపక్కల ప్రాంతానికి తక్కువ వేడి బదిలీ అవుతుంది, గ్యాస్ ఆదా అవుతుంది.

**వంట చేసేటప్పుడు మూత వాడండి**

మీ వంట పాత్రలను మూత పెట్టడం వల్ల గ్యాస్ ఆదా కావడమే కాకుండా సురక్షితమైన పద్ధతి కూడా. మీరు మూత పెడితే వేడి లోపల ఉంటుంది. ఆహారం వేగంగా ఉడుకుతుంది, అంటే తక్కువ గ్యాస్ వాడకం జరుగుతుంది.

**బర్నర్లను శుభ్రం చేయండి**

బర్నర్లపై మసి పేరుకుపోవడం వల్ల మూసుకుపోయి వంట ఎక్కువసేపు అవుతుంది. వంట చేసేప్పుడు పసుపు లేదా నారింజ మంటలు కనిపిస్తాయి. వంట గ్యాస్‌ను ఆదా చేయడానికి బర్నర్‌లను క్రమం తప్పకుండా శుభ్రం చేయండి.

**పాత్రలను పూర్తిగా శుభ్రం చేయండి**

శుభ్రమైన పాత్రలకు వాటి ఉపరితలంపై పూత ఉండదు. దీనితో త్వరగా వేడి అవుతాయి. శుభ్రమైన పాత్రలు వంట సమయంలో ఇంధనాన్ని ఆదా చేయడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మంచిది.

**ఎలక్ట్రిక్ వాడకం**

అన్నం వండుకోవడానికి మీరు ఎలక్ట్రిక్ కుక్కర్లను వాడుకోవచ్చు. దీని ద్వారా గ్యాస్ ఆదా చేయవచ్చు. గుడ్లను ఉడికించేందుకు కూడా ఎలక్ట్రిక్ పరికరాలు ఉన్నాయి.

## డ్రగ్స్ నిర్మూలన మన అందరి బాధ్యత





- ఈగల్ ఫోర్స్ సీఐ హేమారాణి
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

**జూలూరుపాడు, మహా:** సమాజంలో అనేకరకాల తప్పులు, ఉద్రిక్తలకు కారణమవుతున్న ప్రభుత్వ నిషేధిత డ్రగ్స్, మత్తు పదార్థాలను నిర్మూలించడం మన అందరి బాధ్యతని ఈగల్ ఫోర్స్ సీఐ హేమారాణి అన్నారు. గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోనీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతోసీఐ హేమారాణి మాట్లాడుతూ ప్రభుత్వ నిషేధిత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు యువత బానిసలై అనేక రకాల తప్పులు చేస్తూ, అల్లర్లు సృష్టిస్తూ, ఆనందంగా గడపాల్సిన తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని అన్నారు. డ్రగ్స్ వాడకం వలన అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తి చిన్న వయస్సులోనే యువత మరణాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువతకు సమాజానికి హానికరమైన డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనకు మనం అందరం పాటుపడాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, చదువుతో పాటు, గేమ్స్ లాంటి మంచి అలవాట్లు అలవర్చుకొని, సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షిస్తూ, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేపించారు. ఆటలను ప్రోత్సహిస్తూ విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. అనంతరం కళ్యాణ మండపం నుండి చంద్రుగొండ క్రాస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్ లో మానవహారం నిర్వహించారు. డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని గుండెపుడి, కాకర్ల, పాపకొల్లు గ్రామాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై బి రవి, ఎంఈఓ జుంకీలాల్, మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎఫ్ఆర్ఓ ప్రసాద్ రావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీ నరసయ్య తోపాటు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



**భద్రాద్రి బ్యూరో, మహా:** కొత్తగూడెం కేసిఓఏ క్లబ్ ఆవరణలో గురువారం సింగరేణిసేవా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిలుగా జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, ఏసిఎంఓ డాక్టర్ ఎం.ఉష, 2 టౌన్ ఎస్ఐ కుమారి మనీషా పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి వారి అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు.ఈ సృష్టి లో స్త్రీ శక్తిని మించినది ఏమి లేదని మహిళలు స్వయంకృషితో ఎదిగి కుటుంబ పోషణలో పిల్లల అభివృద్ధిలో తమ వంతు కృషి చేయాలని కోరారు. ఉద్యోగం చేసే మహిళల కంటే గృహిణిగా రాణించే మహిళలు మరింత గొప్ప అని తెలిపారు. ఈ రోజుల్లో మహిళలు అంతరిక్షం నుండి భూగర్భ గనులలో అండర్ గ్రౌండ్ వరకు మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని సింగరేణి సంస్థ మహిళా సంస్థలోని మహిళా ఉద్యోగులతో పాటు సింగరేణి గృహిణులతో పాటు పరిసర ప్రాంత నిరుద్యోగ మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో సింగరేణి సంస్థ కంపెనీ వ్యాప్తంగా సింగరేణి సేవా సమితి ద్వారా ఎన్నోవృత్తి విద్యాకోర్స్ లను నిర్వహిస్తున్నదని ఈ వృత్తి శిక్షణా కోర్సులు నేర్చుకున్న మహిళలు తాము నేర్చుకున్న వృత్తి శిక్షణా ద్వారా యూనిట్లను నెలకొల్పుకొని తమతో పాటు మరి కొందరికి జీవనోపాధి కల్పించాలని కోరారు. అనంతరం ఏసిఎంఓ ఎం.ఉష, 2 టౌన్ ఎస్ఐ కుమారి మనీషా లను ను సేవా సభ్యులు ఘనముగా సన్మానించారు. సింగరేణి సేవా సమితి మహిళలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో అందరినీ అలరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సేవా సభ్యులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ శ్రీ జి.వి.కిరణ్ కుమార్, ఏసిఎంఓ డాక్టర్ ఎం.ఉష, 2 టౌన్ ఎస్ఐ కుమారి మనీషా, డిజిఎం(పర్సనల్) కేసా నారాయణ రావు, కమ్యూనికేషన్ ఆఫీసర్ సుజ్ఞాన్, సేవా సెక్రటరీ మాధవీ స్వర్ణలత, సేవ కొఆర్డినేటర్స్ కే.సుజాత, మునిలా రాజ్, పుష్పలత, రమాదేవి, హిమ బిందు, మీనాక్షి దేవి, కోర్సు అధ్యాపకులు సేవా సభ్యులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రధాన వైద్యశాలలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం



**భద్రాద్రి బ్యూరో, మహా:** కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు గురువారం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.కిరణ్ రాజకుమార్ ఆదేశాల మేరకు ప్రపంచ కిడ్నీ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూత్ర పిండాల వ్యాధులు నివారణ చర్యలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం డివైసిఎంఓ కే.ఎస్. విశ్వమేధి, హెల్త్ డాక్టర్ డి.లలిత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి నెలలోని రెండో గురువారం రోజున అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. 2006లో ప్రారంభమైన ఈ ఉద్యమం 2026 నాటికి రెండు దశాబ్దాలను పూర్తి చేసుకుంటోందని అన్నారు. "అందరికీ మూత్రపిండాల ఆరోగ్యం - ప్రజల సంరక్షణ భూమి రక్షణ" అనే నినాదంతో ఈ ఏడాది అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. కిడ్నీ వ్యాధుల పట్ల అవగాహన పెంచడం నివారణాలను అందరికీ తెలియజేయటం ఈ కిడ్నీ డే యొక్క ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. మధుమేహం అధిక రక్త పోటు నొప్పి మాత్రలు ఎక్కువగా వేసుకోవటం ద్వారా దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులు వస్తాయని కిడ్నీ వ్యాధిని "నిశ్శబ్ద వ్యాధి" అని పిలుస్తారని వివరించారు. ఎందుకంటే 80 శాతం కిడ్నీలు దెబ్బతినే వరకు బయటకు ఎటువంటి లక్షణాలు కనిపించవని ఏ లక్షణాలు కనిపించవు అని, కొన్ని లక్షణాలు గుర్తిచటం ద్వారా కిడ్నీ వ్యాధులబారిన పడకుండా ఉంటారని తెలుపుతూ కిడ్నీ వ్యాధుల నివారణ కొరకు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ బిపి షుగర్ ను నియంత్రణలో ఉంచుకుంటూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకొని కిడ్నీలను కాపాడుకోవాలని వివరించారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు కిడ్నీ వ్యాధిన పడిన వారికి ప్రత్యేక డయాలసిస్ వార్డును కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెయిన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనం ఢీకొని

## వలస మహిళ మృతి

**జూలూరుపాడు, మహా:** బతుకుదెరువు కోసం వలస వచ్చి ద్విచక్ర వాహనం ఢీకొని వలస మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఛత్తీస్గడ్ రాష్ట్రానికి చెందిన కొండి కశ్యప్ (51) అనే మహిళ మిర్చి కోత పనులు ముగించుకొని జూలూరుపాడు నుండి చంద్రుగొండ వెళ్లే రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో అనంతారం గ్రామానికి చెందిన పూనెం చంద్రశేఖర్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ ఎదురుగా వచ్చి వలస మహిళ కొండి కశ్యప్ ను బలంగా ఢీకొనడం జరిగింది. దీంతో కశ్యప్ తలకు తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స కొరకు ఖమ్మం సాయి మారుతి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కశ్యప్ ను అక్కడినుండి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలి భర్త నాగ్ సుకుదేవ్ ఫిర్యాదు మేరకు అనంతారం గ్రామానికి చెందిన పూనెం చంద్రశేఖర్ పై ఏఎస్ఐ దమ్మలపాటి వెంకట సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## టియుఎఫ్ జిల్లా అధ్యక్షులుగా వీరేష్ కుమార్

### ఉద్యమకారుల శ్రేయస్సు కొరకు ఉద్యమిస్తాం: వీరేష్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా బోసుపెల్లి వీరేష్ కుమార్ ఎన్నికైనారు. గురువారం టియుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ పిలుపుమేరకు, రిజిస్టర్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా బోసు పెల్లి వీరేష్ కుమార్ ను నియమించడం జరిగింది. రిజిస్టర్ టియుఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంత యాదిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బోసు పెల్లి వీరేష్ కుమార్ మాట్లాడుతూ... నాపై నమ్మకం ఉంచి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ అన్న గారికి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంత యాదిరెడ్డి గారికి మరియు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉన్నటువంటి ఉద్యమకారులు అదేవిధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సంబంధించిన ఉద్యమకారులకు ప్రత్యేకంగా తెలంగాణ ఉద్యమం వందనాలు తెలియజేస్తూ మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం



## బైక్ ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

### ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం

**రాజేంద్రనగర్ మహా ;** కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు యువకులు కొత్తూరు నుంచి శంషాబాద్ వైపు వస్తున్న క్రమంలో మదనపల్లి నేషనల్ హైవే 44 వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది.మదనపల్లి సమీపంలో వేగంగా వచ్చిన ఒక గుర్తు తెలియని వాహనం బైక్ను బలంగా ఢీకొట్టి, వారిపై నుండి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్పై ప్రయాణిస్తున్న సూరజ్, విక్కిసింగ్ అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో సూరజ్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుండగా, విక్కిసింగ్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్టు సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే వాహనదారులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులుగుర్తు తెలియని వాహనం అతివేగంగా నిర్లక్ష్యంగా నడిపిస్తున్నట్లు స్థానికులు తెలపడంతో కేసు నమోదు చేసే ప్రమాదానికి కారణమైన సంఘటనను గుర్తించేందుకు సిసిటీవీ పుటేజీని పరిశీలిస్తున్నారు.

## విద్యార్థుల కంటి వెలుగుకు లయన్స్ క్లబ్ భరోసా




**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కడ్తాల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కళ్లద్దాల పంపిణీ మరియు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిపారు.. సీనియర్ లయన్ డాక్టర్ దామోదర్ రెడ్డిసహకారంతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన 35 మంది విద్యార్థులకు కళ్లద్దాలుఅందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జంగయ్యపిప్పల్ల, వెంకటేష్ గూడె, రాజేందర్ క్యామా, రాజేష్ భాను, కిరణ్, శ్యామ్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు అరుణ జంగయ్య పాల్గొని విద్యార్థులకు సామాజిక సేవపై అవగాహన కల్పించారు.



### వైద్య సేవలు ప్రజలకు సులభంగా

## అందేలా చూడాలి

### చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య

**రంగారెడ్డి జిల్లా (చేవెళ్ల) మహా:** షాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో "99 రోజుల ప్రగతి పాలన" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెడికల్ క్యాంపును చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... వైద్య సేవలు ప్రజలకు సులభంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజలు ఈ మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైద్యులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి ఎఫ్ఎండీ టీకాలు తప్పనిసరి..

### మండల పశువైద్యాధికారి డాక్టర్.అహ్మద్



**మొయినాబాద్ మహా:**పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ ఎఫ్ఎండి టీకాలు పంపిణీ కార్యక్రమాన్ని రైతులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని, మండల పశువైద్యాధికారి డాక్టర్.అహ్మద్ అన్నారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సురంగల్ గ్రామంలో 198 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ ఎఫ్ఎండి టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్.అహ్మద్ మాట్లాడుతూ.. పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు యజమానులు గాలికుంటు వ్యాధి నివారణ ఎఫ్ఎండి టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరాల్లో టీకాలు వేయించినట్లయితే వ్యాధులు ప్రబల్లకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావు, గోరెమియా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలే ముఖ్యం: ఆచారి



**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లులో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ వైద్య సాయం అందించేందుకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి తన సొంత నిధులతో ఉచిత అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ నాయకులతో అంబులెన్స్ సేవలను ప్రారంభించారు., ప్రజలందరూ ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆచారి కోరారు.

## చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో ఫ్లాష్ మాబ్..



### సాంస్కృతిక నృత్యాలతో అల్లరించిన విద్యార్థులు

**మొయినాబాద్ మహా:**చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో విద్యార్థులు కళాశాల మైదానంలో నిర్వహించిన ఫ్లాష్ మాబ్ కార్యక్రమం ఆకట్టుకుంది. నిత్యం పుస్తకాలతో, ప్రయోగశాలలో గడిపే విద్యార్థులు కాస్త సరదాగా గడిపారు. గురువారం చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో ఫ్లాష్ మాబ్ కార్యక్రమని, యూనివర్సిటీ ఫౌండర్ అండ్ చాన్సలర్ సీహెచ్. వీ.పురుషోత్తం రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో సృజనాత్మకత, ఉత్సాహం, సమన్వయం మరియు సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో యూనివర్సిటీకి చెందిన వివిధ విభాగాల విద్యార్థులు సంగీతం, నృత్యం మరియు సమూహ ప్రదర్శనల ద్వారా ప్రత్యేక ఆకర్షణీయమైన ప్రదర్శనలతో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఫౌండర్ అండ్ చాన్సలర్ సీహెచ్.వీ.పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు మరియు సమాజం పట్ల బాధ్యతను పెంపొందించడంలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్. సీహెచ్.సాత్వికా రెడ్డి, వైస్ ఛాన్సలర్ జీ.శంకర లింగం, రిజిస్టర్ యం.రవీందర్, ఆచార్య క్రిస్టోఫర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## న్యూరో కార్డియాలజీ ఆసుపత్రిని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**రాజేంద్రనగర్ మహా ;** మెరుగైన వైద్యం అందించాలనే దృక్పథంతో వైద్యులు పనిచేయాలి. ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలన్నారు. ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్,లిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రామరాజుతో కలిసి గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంషాబాద్ జోన్ పరిధిలోని తొండుపల్లి వద్ద న్యూరో కార్డియాలజీ, లిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలి.మెరుగైన వైద్యం అందిస్తూ ప్రజలకు డాక్టర్లు అందుబాటు ఉండాలన్నారు. అత్యాధునికమైన పరికరాలతో ఏర్పాటు చేసిన ఆసుపత్రి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని కోరారు.కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడం ప్రజా ప్రతినిధుల బాధ్యత

- అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- ప్రజలకు సంక్షేమ పథకాలు చేరేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి బ్యూరో, మహా:** పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడం ప్రతి ప్రజా ప్రతినిధి బాధ్యత అని అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం క్లబ్‌లో గురువారం నిర్వహించిన సర్పంచులు, వార్డు సభ్యులు ఇతర ప్రజా ప్రతినిధుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవారికి చేరేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. రాజకీయాల్లో ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం లభించిందంటే అది పూర్వజన్మ సుకృతంగా భావించాలన్నారు. అందిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సేవే లక్ష్యంగా ప్రజల శ్రేయస్సే పరమావధిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. పేదల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు మరింత కృషి చేయాలని తెలిపారు. తన నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నదని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతిరోజు తెల్లవారుజామున ఐదు గంటల నుంచి పది గంటల వరకు అత్యవసర కేసులకు చికిత్స అందిస్తున్న వైద్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు.

**భద్రాద్రి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర స్థాయిలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయబడిందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉపసంఘ సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన విధి విధానాలను చర్చించి తదుపరి కార్యాచరణపై మార్గదర్శకాలు జారీ చేశారని తెలిపారు. ఈ ఉపసంఘంలో మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా ఉన్నారని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్యం, పెండింగ్ సమస్యల పరిష్కారం, ఆరోగ్యం, రోడ్డు భద్రత, సంక్షేమ పథకాల అమలు, బాలల భద్రత, మాదకద్రవ్యాల నివారణ, వ్యవసాయం, విద్య, యువత క్రీడలు, మహిళల సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై శాఖల వారీగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. పట్టణాల్లో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా చూడడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రజా ప్రతినిధులు అధికారుల మధ్య సమన్వయాన్ని పెంపొందించే గొప్ప కార్యక్రమమన్నారు. వివిధ శాఖల సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు కనుగొనేందుకు ఈ 99 రోజుల కార్యక్రమం ఉపయోగపడుతుందని చెప్పారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను చేపట్టిందన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు



**మొయినాబాద్ మహా :** తెలంగాణ ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మండల, మున్సిపల్ గ్రామాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు ఖైరతాబాద్ ఇన్చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి, మొయినాబాద్ మండల ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి గరుగు రజినీకాంత్, యువజన విభాగం అధ్యక్షులు చాకలి అరవింద్, ఉపాధ్యక్షులు మహమ్మద్ నీయాజుద్దీన్, సీనియర్ ఉద్యమకారులు బిక్షపతి గౌడ్, జొన్నాడ బాలరాజ్, చాకలిగూడ ఆంజనేయులు కలిసి నానకరంగూడలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా నిధులు నియామకాలు అనే లక్ష్యాలు నెరవేరలేదని, నిరుద్యోగ సమస్యలపై హరీష్ రావు పోరాడాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి సరైన గుర్తింపు, ఇంటి స్థలాలు వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చల ఒత్తిడి తీసుకురావాలని హరీష్ రావును వారు కోరారు. హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని, ప్రజా సమస్యలపై పోరాడుతుందని ఆయన హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను నాయకులను పార్టీ గుర్తించి రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టికెట్ కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల, మున్సిపల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యం తాళలేక వృద్ధుడు ఆత్మహత్య



**ఆమనగల్లు, మహా :** మాడ్గుల మండలం నాగిల్ల గ్రామానికి చెందిన జక్కుల ముత్యాలు (65) బుధవారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్దే ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సీఐ వేణుగోపాలరావు తెలిపారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ఆధార్ సెంటర్ లేక అవస్థలు పడుతున్న జనం

- ప్రభుత్వ పథకం పొందాలంటే ఆధార్ తప్పనిసరి
- బస్సు ఎక్కాలన్న ఏదైన ఐడి కావాల్సిందే
- ఆమనగల్లు కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక జనం అవస్థలు
- మార్పులు చేర్పుల కోసం దూర ప్రాంతం వెళ్ళాల్సి వస్తుంది

**ఆమనగల్లు, మహా :** ప్రభుత్వ పథకాలు పొందాలన్నా ,ఇతర గుర్తింపు పత్రాలు తీసుకోవాలన్న, విద్యార్థులు పై చదువులకు వెళ్లాలన్న,ప్రస్తుతం మహిళలు ఆర్టీసీ బస్సు ఎక్కాలన్న ఆధార్ తప్పనిసరి అయింది.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ అమలు దరఖాస్తుల స్వీకరణకు సైతం ఆధార్ కార్డు తప్పనిసరి చేసింది. ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకున్న ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకోవడానికి, కొత్తగా పొందడానికి, ఉన్నవారు ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవడానికి ఆధార్ సెంటర్ లేక రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు, కడ్తాల్,తలకొండపల్లి, మాడుగుల మండల ప్రజలు తీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆధార్ కోసము వేరే జిల్లాలకు వెళ్లాల్సి వస్తుంది.

### 6 గ్యారంటీలకు ఆధార్ లింకు..

4 మండలాలకు కూడలి అయిన ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వము తలపెట్టిన 6 గ్యారెంటీ పథకాలకు అర్హత సాధించేందుకు ఆధార్ తప్పనిసరి కావడంతో కొత్తగా నమోదు అప్డేషన్ కోసం దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తుంది. వివాహం కావడము, ఇంటిపేరు,కేరాఫ్ చిరునామా, ఉద్యోగ ఉపాధి రిత్యా, నివాసము,మొబైల్ నెంబర్ మారడంతో అప్డేషన్ ఆవశ్యకత ఏర్పడింది. కాంగ్రెస్ గ్యారంటీ అమలు దరఖాస్తుల్లో ఆధార్ తప్పనిసరి చేయడంతో ప్రజలు ఆధార్ అప్డేట్ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### బస్సు ఎక్కాలన్న ఎదైన ఐడి కావాల్సిందే..

మహాలక్ష్మి పథకంతో మహిళలు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం పొందాలంటే ఆధార్ అప్డేట్ లేకపోతె టికెట్ ఇస్తున్నారు. ఉచిత ప్రయాణానికి గుర్తింపు కార్డులో ఫోటోలు స్పష్టంగా ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కానీ చాలామంది ఆధార్ కార్డులో చిన్నతనం నాటి ఫోటోలు ఉన్నాయి. వాటిని అప్డేట్ చేసుకోవడానికి నాలుగు మండలాల్లో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలను మహిళలు కోల్పోతున్నామని అసంతృప్తితో ఉన్నారు.వెంటనే ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుల కుటుంబాల తల్లిదండ్రులను పరామర్శించిన మంత్రి వాకిటి శ్రీహరి



**రాజేంద్రనగర్, మహా ;** కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు యువకులు సూరాజ్ విక్కీ సీంగ్, బైక్ పై వెళుతూ శంషాబాద్ మండలంలోని మదనపల్లి నేషనల్ హైవే 44 వద్ద ప్రమాదానికి గురై ప్రాణాలు వదిలారు. మహబూబ్ నగర్ నుంచి హైదరాబాద్ వస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి ప్రమాదం జరిగిన మదనపల్లి వద్ద కొద్దిసేపు వెహికల్ ని ఆపి, సూరజ్, విక్కీ సింగ్ డెడ్ బాడీలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. హైదరాబాదు నుంచి వస్తూ శంషాబాద్ పోలీస్ స్టేషన్ కి వెళ్లి చనిపోయిన యువకుల దహన సంస్కారాల నిమిత్తం వారి కుటుంబీకులకు నగదును అందించారు.



పాఠశాలకు టీచర్‌ను నియమించాలని
## డీఈవోకు వినతి

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిని భర్తీ చేయాలని కౌన్సిలర్ దుడ్డు ఆంజనేయులు యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్యా శాఖ అధికారి శషిందర్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాల నుంచి ఒక టీచర్ డిప్యూటేషన్పై వెళ్లడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే కొత్త టీచర్ను నియమించి విద్యా సంవత్సరాన్ని కాపాడాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ భూములలో మట్టితవ్వకాలు..!

- మట్టి దొంగలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆరుగురు పై కేసు నమోదు పరారీలో మరొకరు
- అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలి
- నిమ్మకు నీరెత్తన్నట్టుగా మైనింగ్ అధికారుల తీరు.?



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మట్టితో తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కులపై పోలీసులు కొరడ ఝులిపించారు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రావిరాల గ్రామంలోని (టీజీఎస్ఐఐసి) ప్రభుత్వ భూమిలో అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నట్లు, పై అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు, బుధవారం రాత్రి రెక్కీ వేసిన పోలీసులు మట్టి దొంగలను అదుపులోకి తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, రావిరాల గ్రామ రెవెన్యూ పరిధిలోని (చిన్నకంచె) 243 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమిలో రావిరాల, తుక్కుగూడ గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు, బుధవారం అర్ధరాత్రి జెసిబి టిప్పర్ల సాయంతో మట్టిని అక్రమంగా తరలిస్తుండగా పై అధికారుల సమాచారం అందుకున్న, ఆదిభట్ల ఎస్సై వెంకటేష్ బృందం, టిప్పర్లను అడ్డుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి, ప్రభుత్వ భూమిలోని మట్టి అక్రమాలకు పాల్పడిన ఆరుగురిపై కేసు నమోదు చేయగా, జెసిబి డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సీఐ రవికుమార్ వెల్లడించారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం మండలాలోని రావిరాల, మమ్మరాజు గూడ శివారు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో (చిన్నకంచె) గత కొన్ని రోజులుగా అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న అక్రమార్కులపై ఆదిభట్ల పోలీసులు కొరడా ఝులిపించారు.

**అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలి.....**

ప్రస్తుతం మార్కెట్లో మట్టికి మంచి డిమాండ్ ఉన్నందున, ప్రభుత్వ అనుమానాలు తీసుకోకుండా ఇష్టానుసారంగా వివరిస్తూ, ఎలాంటి రియాలిటీ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న మైనింగ్ అధికారులు రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. పలుమార్లు రావిరాల చిన్నకాంచలో అక్రమతో పాల్పడుతున్నారని పలువురు విన్నవించుకున్న పెడచెవున పెట్టారని పలువురు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ మైనింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చిన్నకంచలో అక్రమార్కులు పెట్రేగిపోయారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అక్రమాలపై కట్టుదుటమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుచున్నారు.

**నిమ్మకు నీరెత్తన్నట్టుగా మైనింగ్ అధికారుల తీరు...?.**

జిల్లాలో రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో ప్రభుత్వ ప్రభుత్వ భూములలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా అక్రమార్కులకు పాల్పడుతున్న అక్రమార్కులకు, మైనింగ్ అధికారులు వంతెనపాడుతూన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.? ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న, ప్రభుత్వ అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.? మైనింగ్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## పీజీ సీట్లు సాధించిన వైద్యులకు ఘన సన్మానం

**మందమర్రి, మహా:** మందమర్రి మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు రమేష్, మానస లను భారత రాష్ట్ర సమితి నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు చేరువలో ఉండి వివిధ వైద్య సేవలు అందించిన ఇద్దరు వైద్యులకు ప్రజలు రుణపడి ఉన్నారని వెల్లడించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన వైద్యులు పూర్తిస్థాయి సేవలందించడంలో విఫలమయ్యారని అన్నారు. వీరిద్దరూ పీజీ సీట్లు సాధించి ఉన్నత చదువులకు వెళుతున్నారని అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత మేలు చేసేలా దేవుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎండి అబ్బాస్, బర్ల సదానందం, ఎండి మజార్, వేముల నర్సయ్య, నోముల శ్రీధర్ గౌడ్, సాగర్ లు పాల్గొన్నారు.

## కళాశాలలే ప్రకృతి పరిరక్షణ కేంద్రాలుగా మారాలి

వందేమాతరం ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ మాధవరెడ్డి

**ఆమనగల్లు, మహా :** కళాశాలలు ప్రకృతి పరిరక్షణ కేంద్రాలుగా మారాలని సీజీఆర్ సంస్థ సభ్యులు మాధవరెడ్డి చెప్పారు. గురువారం కడ్తాల్ మండలం హనుమాస్పల్లి ఎర్త్ సెంటర్లో బంకట్ లాల్ బాద్రుక కాలేజీ ఫర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కాచిగూడ,హైదరాబాద్ నుండి 43 మంది విద్యార్థులు, ఇద్దరు అధ్యాపక బృందం ది ఎర్త్ సెంటర్ లో ఒకరోజు ఎన్విరాన్మెంటల్ ఓరెంటేషన్ కార్యక్రమంలో భాగంగా సందర్శించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ బోర్డు మెంబర్ వందేమాతరం మాధవరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి కళాశాల విద్యార్థులకు విద్యా, సామాజిక, సేవ వంటి అంశాలతో పాటు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన, అంకిత భావం, బాధ్యత కలిగి ఉండాలని అన్నారు. అనంతరం సి జి ఆర్ సంస్థ ప్రతినిధులు నాగేష్, రజనీకాంత్ ఇరువురు విత్తన బంతుల తయ్యారీ, మదర్ ట్రీ సంరక్షణ, నేచర్ వాక్, ఔషధ మొక్కల ప్రాముఖ్యత తదితర అంశాల మీద అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బంకాట్లల్ బాద్రుక కాలేజీ ఫర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కాచిగూడ అధ్యాపకులు లలిత దేవి అసిస్టెంట్ ప్రొఫెసర్, రమేష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మై భారత్ (మేరా, యువ, భారత్) జిల్లా క్లస్టర్ బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు



**మంచిర్యాల, మహా :** మై భారత్ ( మేరా, యువ, భారత్,) మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాలలో క్లస్టర్ బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీలలో కళాశాల క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రన్నింగ్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ క్రీడా పోటీలు గురు, శుక్రవారాలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు ఈ పోటీలను కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నరేందర్ రెడ్డి ప్రారంభించగా, క్రీడల నిర్వహణను స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆర్. గోపాల్ కృష్ణ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన
## నూతన ఎస్ఎచ్ఓ

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు పోలీస్ స్టేషన్ లో ఎస్ఎచ్ఓ గా నియమితులైన వెంకటేశ్వర్లు పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ని ఎస్ఎచ్ ఓ వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలతో స్నేహ పూర్వకంగా ఉండాలని, పక్షపాతం లేకుండా విధులు నిర్వహించాలని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే కోరారు..

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుకు బిజెపి నేతల భిక్షాటన



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలో ప్రభుత్వ నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని అర్హులైన నిరుపేదల కేటాయించాలని బిజెపి ఆధ్వర్యంలో గురువారం రోజు బెల్లం పల్లి పట్టణంలోని పాతబస్టాండ్ నుండి కాంటా చౌరస్తా వరకు భిక్షాటన చేస్తూ వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు కోడి రమేష్ ఆధ్వర్యంలో భాజపాత్రులు జోలె పట్టి భిక్షాటన చేస్తూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన వ్యక్తులకే కేటాయింపులు జరిగాయని ఆరోపించారు. గతంలోనూ ఒక్కో బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుకై మూడు లక్షల రూపాయలు వసూలు చేసిన ఆడియో టేప్ సైతం సామాజిక ప్రసారమాధ్యమాల ద్వారా బహిర్గతమయ్యాయని గుర్తు చేశారు. ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలోను పలు అవకతవకలు జరిగాయని కోట్లరూపాయల కుంభకోణం జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని నిష్పక్షపాతంగా విచారణ జరిపి అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని విచారణజరిపి లబ్ధిదారులకు న్యాయం చేయాలని లేని పక్షంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలోఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షురాలు ధార కళ్యాణి, జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్‌కుమార్ ,జిల్లా మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శి గోమాస కమల, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, పట్టణ బిజెపి పార్టీ ట్రెజరర్ సంతోష్ అగర్వాల్,సోషల్ మీడియాకన్వీనర్ ఓంసాయి తో పాటు బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.



ఆడిట్ రికవరీలు, పెండింగ్
## ఆడిట్ మెమోలపై సమీక్ష

**మందమర్రి, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఆడిట్ రికవరీలు, పెండింగ్ ఆడిట్ మెమోలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా ఎస్.ఓ.టు.జి.ఎం. జి.యల్. ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇంటర్నల్ కమిటీ సభ్యులు డి. దామోదర్ రావు (డి.వై.జి.ఎం,ఎఫ్ అండ్. ఏ) ఇంటర్నల్ ఆడిట్, 202526 ఆర్థిక సంవత్సరం యొక్క వివరాలను ఏరియా ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కే గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి జ, డీ.జీ.ఎం పర్సనల్ అశోక్, ఇంటర్నల్ ఆడిట్ కమిటీ సభ్యులు డి.దామోదర్ రావు, (డివైజియం. ఎఫ్ అండ్ ఏ), సరిత డివై. ఫైనాన్స్ మేనేజర్, సివిల్ ఎస్.ఈ శ్రీధర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఆడిట్ కమిటీ సభ్యులు జె.శేషు కుమార్ సీనియర్ ఎకౌంట్ ఆఫీసర్, ఉదయ్ కిరణ్, డి రాజశేఖర్ జూనియర్ అకౌంటెంట్, ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్మెంట్ల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మందమర్రి, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమైనదని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు.గురువారం క్యాతనపల్లి మునిసిపాలిటీలో అమ్మ గార్డెన్స్ లో గ్రామపంచాయతీ సర్పంచ్ లు, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ మేయర్,చైర్ పర్సన్ లు, డిప్యూటీ మేయర్, వైస్ చైర్ పర్సన్ లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి డి.సి.పి. ఎ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మధ్యనే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. ఈ క్రమంలో విధులు, అధికారాలపై గ్రామపంచాయతీల సర్పంచ్ లకు శిక్షణ తరగతులు నిర్వహించడం కూడా జరిగిందని చెప్పారు. ఇందులో పంచాయితీ రాజ్ చట్టాల గురించి వివరించడం జరిగిందని తెలిపారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని అన్నారు.గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి లలో కార్యచరణ అమలు చేయాలని ఆయన ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్ తదితర అంశాలపై కార్యాచరణ చేపట్టాలని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అమలు చేయడంలో ప్రజా ప్రతినిధులు తీసుకోవలసిన చర్యల గురించి తెలుసుకోవాలని తెలిపారు. తెలంగాణ పంచాయతీరాజ్, మున్సిపల్ యాక్ట్ ల గురించి ప్రజాప్రతినిధులకు తెలియవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యా రంగ అభివృద్ధి దిశగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులు, విద్యుత్, త్రాగునీరు, మూత్రశాలలు, ప్రహరీ గోడ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ క్రింద పనులు చేయడం జరిగిందని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ అభివృద్ధి పనులలో భాగస్వామ్యలను చేశామని తెలిపారు. రేషన్ కార్డు కొరకు దరఖాస్తులు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో నెలకొన్న సామాజిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని వెల్లడించారు.నిరుద్యోగ యువత భవిష్యత్తు దృష్ట్యా మాదకద్రవ్యాల నిరోధకం, మద్యం వినియోగంపై ప్రజా ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 2, 3 వార్డులలో 3, 4 రోజుల పాటు పారిశుధ్యం, త్రాగునీటి పైప్ లైన్ల మరమ్మత్తు, ఇతర పనులు చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలలో ఒకసారి లబ్ధి పొందిన వారిని గుర్తించి, వారి పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు.ఇలాంటి నిర్ణయాలతో ప్రభుత్వ లక్ష్యాలు విజయవంతం అవుతాయని తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి వాహనదారులకుఅవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటు చేయబడినందున మున్సిపల్ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు అవుతాయని, ఈ నిధులను సక్రమంగా వినియోగిస్తూ ప్రజా ప్రయోజనకర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. వేసవిలో ప్రజలకు నిరంతరం నీటిని సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు తమ పరిధిలో పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు.



మార్చి 16న ఛలో హైదరాబాద్
## ధర్నాను జయప్రదం చేయండి

- అంగన్వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు చేయాలి
- అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)

**మంచిర్యాల, మహా :** అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మార్చి 16 న ఛలో హైదరాబాద్ ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పిలుపునిచ్చారు.గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఐసీడిఎస్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మల్లేశంకు పలు వినస్తులతో కూడిన పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్వాడి ఉద్యోగులకు హామీలు ఇచ్చి రెండు సంవత్సరాలు దాటిన ఆ హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. అంతే కాకుండా ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఎన్.ఈ.పి ని తీసుకువచ్చారని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్.ఈ.పి ని అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. ఫిక్సుడ వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఐసిడిఎస్ కు బడ్జెట్ ను పెంచాలని వివరించారు. ప్రభుత్వ పాఠశాల మాదిరిగానే అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. ఇతర సమస్యల పరిష్కారానికై జరిగే ధర్నాకు జిల్లాలోని అంగన్వాడీ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, జిల్లా ఉపాధ్యక్షురాలు అనురాధ పాల్గొన్నారు.

చార్లెట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# మహిళలకు కుట్టు మిషన్స్ పంపిణీ

పదవ తరగతి విద్యార్థులకు కిట్లు అందజేత

చార్లెట్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయం





**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో చార్లెట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు అత్యంత ఉత్సాహంగా సాగాయి.విద్యార్థులకు మరియు మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్ పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లైన్స్ క్లబ్ గుడిపూరి వెంకటేశ్వరావు జిల్లా జి. యం. టి.కో ఆర్డినేటర్,స్థానిక 4వ వార్డు కౌన్సిలర్ భూక్యా జ్యోతి లింగ నాయక్,బిషప్ దుర్గం ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా జాటోత్ డేవిడ్ రాజు రంగమ్మ చార్లెట్ అనాథ పిల్లల ఆశ్రమం ను నిర్వహిస్తూ,అనాథ పిల్లలను చేరదీసుకొని,వారి అలనా పాలన చూసుకుంటూ,అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా విద్యార్థులను ఆదుకోవడంలో పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ వారికి ప్యాడ్లు పెన్ కిట్లను అందజేశారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కుట్టు శిక్షణ మూడు నెలలు ఇచ్చి, పది మంది మహిళలకు, ఇద్దరు ట్రాన్స్ జెండర్స్ కు ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ సేవయే లక్ష్యంగా తమ ఫౌండేషన్ నిరంతరం పనిచేస్తుందని, ప్రధాన కార్యదర్శి జాటోత్ శేఖర్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి సాధించి కుటుంబాలకు ఆసరాగా నిలవాలన్నదే తమ ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు నాయక్, పాస్టర్ బాలాజీ నాయక్, జాటోత్ శంకర్, ధారావత్ కృష్ణ,బానోత్ వెంకన్న నాయక్,ఫౌండేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, విద్యార్థులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

..బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి,మహా:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి టీపీసీసీ ఎస్సీ విభాగ చైర్మన్గా ఎంపికైన మానకొండూరు శాసనసభ్యులు సత్యనారాయణ కృషి చేస్తారని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు.టీపీసీసీ ఎస్సీ విభాగ చైర్మన్‌గా మానకొండూర్ శాసనసభ్యులు కవంపల్లి సత్యనారాయణ పదవి బాధ్యతల స్వీకరణ - కార్యక్రమంలో పాల్గొన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి గురువారం రోజు పాల్గొన్నారు.హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన టీపీసీసీ ఎస్సీ విభాగ చైర్మన్‌గా ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొని కవంపల్లి సత్యనారాయణ కి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి కవంపల్లి సత్యనారాయణ కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఎస్సీ వర్గాల అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి తన ప్రసంగంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టోపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బేతెస్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రినీటి హైస్కూల్ పదవ తరగతి బాల బాలికలకు ప్యాడ్స్,కంబాక్స్ లు పంపిణి

**మ్యానేజింగ్ ట్రస్టి దుర్గంకరుణశ్రీ-ప్రభాకర్**



**సూర్యాపేట జిల్లా మహా:** మునగాల మండల కేంద్రం లోని ట్రినీటి హైస్కూల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు పదవతరగతి విద్యార్థిని, విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, స్కెల్స్, ఏరైజార్స్,పెన్సిల్స్,శాప్సనార్స్ లు బేతెస్థ ఫౌండేషన్ చైర్మన్ దుర్గం కరుణ శ్రీ ప్రభాకర్ అందించినారు.అనంతరం బేతెస్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ పరీక్షలు బాగా రాసి 10 కి 10శాతం మార్కులు సాధించాలని మరియు ట్రినీటి హై స్కూల్ పాఠశాలకు,టీచర్స్ కు తల్లి తండ్రులకు మంచి పేరును తీసుకురావాలని భవిషత్ లో ఉన్నత స్థాయికి చేరాలంటే పదవతరగతి మార్కులు ఎంతో ఉపయోగపడతాయనీ అన్నారు. ఈ కార్యక్రమం లో బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థపకులు బిషప్ దుర్గం ప్రభాకర్, ట్రినీటి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ మల్లంగి వనజ, ప్రిన్సిపాల్ డా ముల్లంగి జాకబ్ రాజు, పాల్వాయి అజయ్ తదితరులు పాల్గొన్నారు

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల రిమాండ్



**కుషాయిగూడ, మహా :** గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు వలపన్ని పట్టుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... అంబేద్కర్ నగర్ సమీపంలో ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై మౌనిక సిబ్బందితో కలిసి వెళ్లి గమనించగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పరిశీలించగా వారి వద్ద 1 కిలో 50 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. ఇద్దరు యువకులను పోలీస్ స్టేషన్ కు తరలించి విచారించగా దమ్మాయిగూడ మల్లికార్జున నగర్ కు చెందిన కొల్లిపాక కౌశిక్ (23), దేవేంద్ర (22) గా గుర్తించారు. పోలీసుల విచారణలో గంజాయి విక్రయిస్తున్నట్లు వారు ఒప్పుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి గురువారం రిమాండ్ కు తరలించారు.

## యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్



**యాదగిరిగుట్ట, మహా:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని గురువారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గవర్నర్ కు ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి,ఆలయ ఈఓ గవర్నర్ కు పూల మొక్కలు బహుకరించి స్వాగతం పలికారు.తొలుత రాష్ట్రగవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. వేద పండితులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి భావానీ శంకర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు, వేద పండితులు ఆలయ సంప్రదాయంతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ ధ్వజ స్తంభం వద్ద మొక్కి స్వామి వారి అంతరాలయం లోఅర్చన పూజలు నిర్వహించారు.కార్య నిర్వాహణాధికా స్వామి వారి మెమెంటోను అందచేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త స్వామి వారి ప్రసాదాన్ని గవర్నర్ కు అందచేశారు. అనంతరం అనుబంధ దేవాలయం శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్పటిక లింగానికి అభిషేకం చేసిన గవర్నర్ దంపతులు.

## స్పీకర్ నిర్ణయం ఫిరాయింపులను ప్రోత్సహించేలా ఉంది

బిఆర్ఎస్ పార్టీ హుజూర్ నగర్ నియోజకవర్గ నాయకులు మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి



**హుజూర్ నగర్ మహా:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ బీఫామ్ పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను విచారించి పార్టీ మారారనడానికి ఆధారాలు లేవని వారిపై అనర్హత వేటు వేయకపోవడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి విఘాతం కలిగించడమే గాక ఫిరాయింపులను ప్రోత్సహించేలా స్పీకర్ నిర్ణయం ఉందని ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి అన్నారు. హుజూర్ నగర్ మండలం లోని సీతారాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో సర్పంచ్ అద్దంకి సైదీశ్వరరావు తో కలిసి ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ బీఫామ్ పై ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేంద్ర ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ బిఫాంపై ఎంపీగా పోటీ చేసిన కాంగ్రెస్ సభలు సమావేశంలో పాల్గొంటున్న కడియం శ్రీహరి లను ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీ సభ్యులేనని తేల్చి స్పీకర్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమన్నారు ఇది చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతుందని అన్నారు పార్టీలకు రహితంగా స్వతంత్రంగా వ్యవహరించవలసిన సభాపతి కాంగ్రెస్ పార్టీ పెద్దల ఒత్తిడి మేరకు ప్రజా తీర్పును అపహాస్యం చేసేలా అనైతిక నిర్ణయం తీసుకున్నారని ఇటువంటి చర్యలను ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఆమోదించరన్నారు ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్ బుధవారం దానం నాగేంద్ర కడియం శ్రీహరి లకు క్లీన్ చిట్ ఇస్తూ వారిపై దాఖలైన పిటిషన్ లను కొట్టివేయడం స్పీకర్ అప్రజా స్వామిక నిర్ణయం అన్నారు దీనిపై న్యాయస్థానంలో పార్టీ పరంగా పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ కాచవరపు వెంగళరావు బిఆర్ఎస్ పార్టీ నాయకులు సామల మట్టా రెడ్డి వీరమల్ల సుందరయ్య ఊరుగొండ కనక దూది గాని శరత్ బాబు గోదా సాయి పంగ నరసింహారావు గోదా ఏసు అద్దంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## కొండయ్య మాస్టారి మరణం... విద్యారంగానికి తీరని లోటు

**టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి**



**కుషాయిగూడ, మహా :** కొండయ్య మాస్టారి మరణం విద్యా రంగానికి తీరని లోటు అని, ఆయన సేవలు జవహర్ నగర్, విద్యార్థులకే కాక జిల్లా విద్యారంగానికి తీరని లోటు అని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి పేర్కొన్నారు.మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ కొలకొండయ్య ఇటీవలే అకస్మాత్తుగా మరణించగా ఆయన జ్ఞాపకార్థం గురువారం సంస్మరణ కార్యక్రమ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు చావా రవి హాజరై మాట్లాడుతూ కొండయ్య మాస్టారు జీవితం అజరా మరణమని క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయులుగా వారి సేవలు స్లాగనీయమన్నారు నిరంతరం విద్యార్థుల శ్రేయస్సు గూర్చి ఆలోచిస్తూ విద్యా బోధనలో ముందుండేవారన్నారు. వారి అకస్మిక మరణం విద్యార్థులకు గాక పాఠశాలకు వారి కుటుంబానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చావా రవి కొండయ్య కుటుంబానికి ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ నుండి ఆరు లక్షల చెక్కును అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే వ్యవస్థ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు అజాముద్దీన్, టిఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయసింహారెడ్డి, మదన్ రెడ్డి, రాకేష్, వందన, రవి, కరుణాకర్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజేందర్ ,మల్లికార్జున్ రావు, ఉషారాణి ,వాసా కృష్ణ, మండల విద్యాధికారి నరసింహ, విద్యార్థులు, కొండయ్య మాస్టారు కుటుంబ సభ్యులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గవర్నర్ ను సత్కరించిన ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట, మహా:** తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వామివారి దేవస్థానాన్ని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా గవర్నర్ ను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించి, గవర్నర్గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.



# సర్పంచ్ లు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కల్గి వుండాలి...

**ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**





**భువనగిరి, మహా:** ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల పై పూర్తి అవగాహన చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు గ్రామాలలో, వార్డులలో అందించి జిల్లాను అభివృద్ధిలో ముందు ఉంచాల్సిన బాధ్యత సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, చైర్ పర్సన్ లపై ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు.గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక @99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణం లోని వి కన్వెన్షన్, న్యూ వివేరా లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, సర్పంచులకు, చైర్ పర్సన్ లకు ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు కార్యక్రమం ముందుగా రాష్ట్రగేయం వందేమాతరం గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగుతుందని , సర్పంచులు, వార్డు మెంబర్లు, చైర్ పర్సన్ లు గ్రామాలలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవారికి అమలు చేసేలా చూడాలన్నారు. గత రెండు సంవత్సరాల వ్యవధిలో రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు ,200 యూనిట్లు ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డుల జారీ, సన్న బియ్యం సరఫరా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని గ్రామాలను అందంగా తీర్చిదిద్దే విధంగా పనులు చేపట్టాలన్నారు. అవసరమైన నీరును ఆలేరు నియోజకవర్గంలో అన్ని చెరువులు నింపడం జరిగిందన్నారు. రాబోవు కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి గ్రామాలలో, పట్టణాలలో నీటి ఎద్దటి లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) మాట్లాడుతూ... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యశరణ ప్రణాళికను నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు సర్పంచులు అవగాహన కలిగి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని, ఐదు సంవత్సరాల పాలనకు మంచి సహకారం ప్రజలకు అందించాలన్నారు. ప్రజలు మెచ్చేలా అభివృద్ధి పనులు గ్రామాలలో, పట్టణాలలో చేపట్టాలున్నారు. ప్రభుత్వ పథకాలను అవగాహన చేసుకుని వాటిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో తెలుసుకొని గ్రామాలు అభివృద్ధి పథంలో ఉంచాలన్నారు. భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచులు వార్డు మెంబర్లు ప్రజలకు ఏ సమస్య ఉందో తెలుసుకుని వారికి అవసరమైన సాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు ,ఇతర అభివృద్ధి పనులను గ్రామాలలో చేపట్టాలన్నారు. ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అవుతున్నందున 5 ఏళ్ల పాలన సజావుగా నిర్వహించి ప్రజలకు మెచ్చి నచ్చి నట్టుగా సేవలు అందించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులు అర్హులైన ప్రతి పేదవారికి అందించే బాధ్యత గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లు, చైర్ పర్సన్ లదేనని అన్నారు. సాగునీటికి అన్ని చెరువులను నింపుకున్నామని ఎక్కడైనా సమస్య ఉంటే అక్కడికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని ఏ సమస్య ఉన్న పరిష్కరించే బాధ్యత నాదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం, పరిశుభ్రత పాటించినట్లయితే గ్రామాలు చాలా అందంగా తీర్చిదిద్దబడతాయి అన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా 10 ప్రధాన అంశాలను గ్రామాలలో, వార్డులలో సమస్యలు తీర్చి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ లో ఉన్న ఫైల్స్ క్లియర్ చేయడం జరుగుతుందన్నారు. నీటి ఎద్దడి లేకుండా ఎండలు దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళికలు వేసుకొని మీ మీ గ్రామాలలో సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు ప్రజలకు అన్ని సదుపాయాలను గ్రామాలలో, పట్టణాలలో అభివృద్ధి పనులు చేపట్టి స్వయం సభివృద్ధి సాధించే విధంగా కృషి చేయాలన్నారు. సెర్ప్ సి.ఈ.ఓ, పంచాయతీ రాజ్ కమీషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రతి మండలంలో ప్రజా పాలన వచ్చినప్పటినుండి ఎన్నో అభివృద్ధిలు చేపట్టామన్నారు. తరతరాలుగా గుర్తుండే విధముగా అభివృద్ధి పనులు చేయాలన్నారు. కొత్తగా ఎన్నికైన వారికి ఒక స్ఫూర్తిని ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని పట్టుదలతో అభివృద్ధి పనులు చేపడితే ఎలా అయినా విజయం సాధించవచ్చన్నారు. దానికి సంబంధించిన ప్రణాళికలు వేసుకోవాలని, గ్రామాలలో వార్డులలో కానీ గెలుపొందిన వారు మార్పు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం నుండి 15th ఫైనాన్స్ కమిషన్ ఫండ్ కూడా ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని, అట్టి నిధులు గ్రామాలలో, కానీ పట్టణాల్లో కానీ దీనికి ఉపయోగిస్తే ప్రజలకు ఉపయోగపడుతుందని ప్రణాళిక వేసుకొని నిధులు వృధా చేయకుండా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాలలో నూతన అంగన్వాడీ, తదితర అవసరమైన భవనాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. పచ్చదనం స్వచ్ఛందనంగా గ్రామాలు తీర్చిదిద్ది, శానిటేషన్ విధులు నిర్వహించే సిబ్బంది మంచిగా పని చేస్తే గ్రామం మంచిగా తీర్చిదిద్దుతారని అన్నారు. గ్రామాలు,పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ..,99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గురించి అవసరమైన అవగాహన అందించేందుకు నూతన వార్డు సర్పంచులు, వార్డ్ మెంబర్లు, చైర్ పర్సన్ లు లకు ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలను , పట్టణాలను అందంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, లబ్దిదారుల ఎంపిక, ప్రభుత్వ పని తీరు లో వచ్చిన మార్పుల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతి శాఖ సంబంధించి పని తీరు ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమంలో తెలుస్తుందని, ప్రజా ప్రతినిధులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా జిల్లాలో ప్రమాద నివారణకు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గ్రామాలలో పట్టణాలలో రాష్ డ్రైవింగ్, వేరే హెల్మెట్ ,నో డ్రగ్స్ తదితర అంశాల గురించి ప్రజలకు ,ముఖ్యంగా ఎదుగుతున్న పిల్లలకు విధిగా అవగాహన కల్పించాలన్నారు.ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలను జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లాలోని అన్ని మండలాల చైర్మన్లు, వార్డు మెంబర్లు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన కొరత లేదు



- తప్పుడు ప్రచారం మానుకోవాలి
- ఎల్పీజీ ఉత్పత్తిని 28 శాతం పెంచాం
- లోక్‌సభలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడి

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ మనదేశంలో ఇంధన కొరత ఎంతమాత్రం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఏవియేషన్ టర్బైన్ ఇంధన నిల్వలు సరిపడా ఉన్నట్లు తెలిపారు. ఇంధనం విషయంలో ప్రజలను ఆందోళనకు గురిచేసేలా తప్పుడు ప్రచారం చేయొద్దని ప్రతిపక్షాలకు హితవు పలికారు. గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఇంధన కొరత గురించి ప్రస్తావించారు. దీనిపై హర్దీప్‌సింగ్ పురి సమాధానం ఇచ్చారు. దేశంలోని 33 కోట్ల కుటుంబాలకు ఎల్పీజీ సరఫరాకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ముఖ్యంగా పేద కటుంబాలకు ఎలాంటి కొరత రానివ్వబోమని ప్రకటించారు. దేశీయ సరఫరా వ్యవస్థను పరిరక్షిస్తామన్నారు. అన్ని రకాల ఇంధనం విషయంలో రిటైల్ ఔట్‌లెట్ల వద్ద సరిపడా నిల్వలు ఉన్నాయని చెప్పారు. సప్లై చైన్స్ యథాతథంగా పని చేస్తున్నాయని వెల్లడించారు. అన్ని రాష్ట్రాలకు అదనంగా కిరోసిన్ కేటాయిస్తున్నా మని తెలిపారు. ఇంధన సరఫరాలో సంక్షోభం ఉన్నప్పటికీ మన దగ్గర మాత్రం ఎలాంటి ఇబ్బందులు లేవని హర్దీప్‌సింగ్ పురి స్పష్టంచేశారు. ఎల్పీజీ ఉత్పత్తిని 28% పెంచినట్లు వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలను బట్టి చూస్తే మన దేశంలో ఇంధనం ధరలు తక్కువగానే ఉన్నాయని వ్యాఖ్యానించారు. హోర్ముజ్ జలసంధిలో చమురు రవాణా ఆగిపోయినప్పటికీ ఇతర దేశాల నుంచి మనకు ముడి చమురు అందుతూ నే ఉందని గుర్తుచేశారు. 2006-07లో కేవలం 27 దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకున్నామని, ప్రస్తుతం 40 దేశాల నుంచి దిగుమ తి చేసుకుంటున్నామని తెలియజేశారు. మోదీ దౌత్య నీతి వల్లే ముడి చమురు విషయంలో ఆటంకాలు లేకుండాపోయాయని మంత్రి ఉద్ఘాటించారు.

# రెండు నౌకలపై ఇరాన్ దాడి



**న్యూఢిల్లీ:** తమపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ సైతం దీటుగా స్పందిస్తూ అమెరికా తదితర ఇతర దేశాల నౌకలపై దాడులుచేస్తోంది. బుధవారం రాత్రి ఇరాక్‌లోని ఉమ్ ఖాసర్ నగరంలోని ఖోర్ అల్ జుబేర్ నౌకాశ్రయంలోని అమెరికాకు చెందిన మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉన్న ముడిచమురు రవాణా నౌక 'సేఫ్‌సీ విష్ణు'పై ఇరాన్ దాడిచేసింది. ఈ ఘటనలో ఒకరు చనిపోయారు. అతడిని భారతీయునిగా గుర్తించామని ఇరాక్‌లోని భారతీయ రాయబార కార్యాలయం గురువారం తమ సామాజికమాధ్య ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టింది. అతని స్వరాష్ట్రం, కుటుంబం వంటి ఇతర వివరాలు ఏవీ ఇంకా తెలియరాలేదు. మంటల్లో చిక్కుకున్న ఆ నౌక నుంచి 27 మంది సిబ్బందిని ఎలాగోలా కాపాడారు. గాయపడిన వారిని సమీపంలోని బస్రా నగరంలోని ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. నౌకలోని 27 మంది సిబ్బందిలో 15 మంది భారతీయులేనని ఇండియన్ ఎంబసీ పేర్కొంది. ఈ నౌకతోపాటు సమీపంలోని మాల్టా దేశ జెండాతో ఉన్న జిఫిరోస్ నౌక మీదా ఇరాన్ ఆత్మాహుతి పడవలు దాడిచేశాయి. పేలుడుపదార్థాలతో దూసుకొచ్చి సూసైడ్ బోట్‌లు ఢీకొనడంతో పేలుళ్లు జరిగి సేఫ్‌సీ విష్ణు, జిఫిరోస్ నౌకలు మంటల్లో చిక్కుకున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ రెండు నౌకలు మొత్తంగా 4,00,000 బ్యారెళ్ల ముడిచమురును ఇరాక్ నుంచి తీసుకొస్తున్నట్లు షిప్‌ల ట్రాకింగ్ వెబ్‌సైట్ అయిన 'ట్యాంకర్‌ట్రాకర్స్.కామ్'వెల్లడించింది. అమెరికాకు చెందిన సేఫ్‌సీ ట్రాన్స్‌పోర్ట్ ఐఎన్‌సీ సంస్థ 'సేఫ్‌సీ విష్ణు'నౌకను నిర్వహిస్తోంది. 228.6 మీటర్ల పొడవు, 32.57 మీటర్ల వెడల్పయిన సేఫ్‌సీ విష్ణు నౌకను 2007లో తయారుచేశారు. గరిష్టంగా దాదాపు 74,000 టన్నుల బరువైన సరకులను ఇది మోసుకెళ్లగలదు. జిఫిరోస్‌ను గ్రీస్‌కు చెందిన సంస్థ నిర్వహిస్తోంది.

# సీఈసీని తొలగించాలంటూ నోటీసు



## 193 మంది ఎంపీల సంతకాలు

**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తొలగింపునకు ఇటీవల తీర్మానం ప్రవేశపెట్టిన విపక్షాలు.. తాజాగా ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) తొలగింపునకు సైతం నోటీసు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలంటూ ప్రతిపక్షాలు సిద్ధం చేసిన నోటీసుపై మొత్తం 193 మంది ఎంపీలు సంతకాలు చేశారు. ఇందులో 130 మంది లోక్‌సభ సభ్యులు కాగా, 63 మంది రాజ్యసభ ఎంపీలని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. శుక్రవారం ఈ నోటీసును లోక్‌సభకు లేదా రాజ్యసభ చైర్మన్‌కు అందజేసే అవకాశాలున్నాయంటున్నారు. ముందుగా ఎవరికి ఇచ్చేదీ స్పష్టం కావాల్సి ఉంది. సీఈసీ తొలగింపు కోరుతూ ఇవ్వనున్న నోటీసుపై సంతకాలు చేసేందుకు పెద్ద సంఖ్యలో ఎంపీలు ముందుకు వచ్చారని ప్రతిపక్ష నేత ఒకరు తెలిపారు. నోటీసుకు అవసరమైన సంఖ్యలో సంతకాలను ఇప్పటికే సేకరించినప్పటికీ, గురువారం కూడా ఎంపీలు కొందరు ఆసక్తి కనబరిచారన్నారు. సీఈసీ తొలగింపును కోరాలంటే లోక్‌సభలో కనీసం 100 మంది, అదే రాజ్యసభలో అయితే 50 మంది ఎంపీలు సంతకాలు చేస్తే సరిపోతుందని నిపుణులు అంటున్నారు.

ప్రతిపక్ష ఇండియా కూటమి సభ్య పార్టీలతోపాటు, అధికారికంగా ఆ కూటమిలో చేరని ఆప్‌కు చెందిన ఎంపీలు కూడా నోటీసుపై సంతకాలు చేశారని ఆ నేత వివరించారు. ఓటరు జాబితా సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) విషయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అధికార పక్షానికి అనుకూలంగా, వివక్షా పూరితంగా వ్యవహరిస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. భారీ సంఖ్యలో ఓట్ల తొలగింపుపై జరిగే విచారణను ఆయన అడ్డుకుంటున్నారంటున్నాయి. కాగా, సీఈసీని తొలగించాలంటూ పార్లమెంట్‌లో నోటీసు జారీ చేయనుండటం ఇదే మొదటిసారి కానుంది. తొలగింపు తీర్మానాన్ని పార్లమెంటులోని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. తీర్మానం ఆమోదం పొందాలంటే, సభలోని మొత్తం సభ్యులలో మెజారిటీ (50% కంటే ఎక్కువ) ఉండటంతో పాటు, ఆ సమయంలో సభకు హాజరై ఓటేసిన వారిలో రెండింట మూడొంతుల మెజారిటీ తప్పనిసరి.





# గ్లామర్‌తో గత్తర లేపిన అప్సర రాణి..

## ఆర్జీవీ ఫేవరెట్ హీరోయిన్ ఇప్పుడు ఎక్కడుంది?

సినీ పరిశ్రమలో చాలామంది హీరోయిన్లు ప్రారంభంలో మంచి జోరు చూపించి తర్వాత క్రమంగా సినిమాలకు దూరమవడం సహజమే. కొంతమంది పెళ్లి చేసుకుని ఇండస్ట్రీకి గుడ్‌బై చెబుతుంటే, మరికొందరు అవకాశాలు తగ్గడంతో మెల్లగా తెరపై కనిపించకుండా పోతారు. ఇలాంటి హీరోయిన్లలో ఒకరు అప్సర రాణి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలలో కనిపిస్తున్న ఈ బ్యూటీని చాలా మంది వెంటనే గుర్తుపట్టలేకపోయినా, ఒకప్పుడు ఆమె యువతలో మంచి క్రేజ్ సంపాదించింది. తన అందం, గ్లామర్‌తో కుర్రకారును ఆకట్టుకున్న అప్సర రాణి కొంతకాలం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా నిలిచింది.అప్సర రాణి అసలు పేరు అంకేత మహారాణా. అయితే సినీ రంగంలోకి వచ్చిన తర్వాత ఆమె అప్సర రాణి అనే పేరుతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన సినిమాలతో ఆమెకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది.

అప్సర రాణి హీరోయిన్‌గా మొదటిగా '4 లెటర్స్' అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ తర్వాత తెలుగు, హిందీ భాషల్లో పలు సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా బోల్డ్ పాత్రల్లో నటించడంలో ఆమె వెనుకాడకపోవడం వల్ల త్వరగా పాపులారిటీ పొందింది. ప్రత్యేకంగా రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన 'డేంజర్' సినిమాలో ఆమె నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆ సినిమాలో తన గ్లామర్‌తో పాటు నటనతో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా అప్సర రాణి చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ తన ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తుంటుంది. ఆమె పోస్ట్ చేసే గ్లామర్ ఫోటోలు సోషల్ మీడియాలో తరచూ వైరల్ అవుతుంటాయి.

అయితే ఒకప్పుడు వరుస అవకాశాలు అందుకున్న ఈ బ్యూటీకి ప్రస్తుతం పెద్దగా సినిమా ఆఫర్లు రావడం లేదని తెలుస్తోంది. కొన్ని ప్రాజెక్టులు చర్చల్లో ఉన్నప్పటికీ పెద్దగా సినిమాల్లో కనిపించకపోవడంతో అభిమానులు కూడా ఆమె రీఎంట్రీ కోసం ఎదురు చూస్తున్నారు. గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న అప్సర రాణి మళ్లీ పెద్ద సినిమాలతో తిరిగి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు. భవిష్యత్తులో ఆమెకు మంచి అవకాశాలు వస్తాయా లేదా అన్నది చూడాలి.

## ముఖానికే కాదు శరీరానికి కూడా మేకప్...

# ఇబ్బందిపడ్డా: సమీరారెడ్డి

సినిమా ఇండస్ట్రీలో టాలెంట్ కంటే అందానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది అంటుంది నటి సమీరా రెడ్డి. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో.. కలర్ డిస్క్రిమినేషన్ ఎక్కువ ఉంటుందని, తాను కూడా ఇది ఫేస్ చేశానని చెబుతోంది. తెలుగులో `నరసింహుడు`, `అశోక్` 'జై చిరంజీవా' లాంటి సినిమాలతో అలరించిన ఈ బ్యూటీ.. 2014లో ఓ వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని సినిమాలకు దూరం అయింది. పిల్లలు పుట్టిన తర్వాత ఆమె శరీరంలో భారీ మార్పులు వచ్చాయి. కాస్త బొద్దుగా మారడంతో..సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోల్స్ కూడా వచ్చాయి. తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ట్రోల్స్ గురించి, ఇండస్ట్రీలో హీరోయిన్‌గా తాను ఎదుర్కొన్న సవాళ్లను గురించి వివరించింది. 'సినిమా ఇండస్ట్రీలో అందానికే ఎక్కువ ప్రాధాన్యత. టాలెంట్ గురించి పట్టించుకోరు. తెల్లతోలు వ్యామోహం నన్ను చాలా ఇబ్బందికి గురి చేసింది. సాధారణంగా ఓ నటిగా, మహిళగా ఎప్పుడూ అందంగా ఉండడానికే ప్రయత్నించాను. కానీ మరింత అందంగా కనబడాలంటూ నాకు మేకప్ వేసేవాళ్లు. ముఖానికి మాత్రమే కాకుండా.. శరీరానికి కూడా మేకప్ వేసుకోవాలని ఒత్తిడి చేశారు. అలా చెప్పడం నన్ను చాలా బాధించింది. నిజంగానే నేను అందంగా లేనేమో అనే భావన నాలో కలిగింది. అంతేకాదు, నేను స్లిమ్‌గా లేనని బాధపడేదాన్ని. నేను చాలా పొడుగ్గా ఉండడంతో.. వయసులో పెద్దదిగా చూసేవాళ్లు. అది నా మైండ్‌లో అలా ఉండిపోయేది. ఇండస్ట్రీలో ఉన్నన్ని రోజులు నా బాడీ సైజు గురించే మాట్లాడేవాళ్లు కానీ.. టాలెంట్, యాక్టింగ్ గురించి చర్చ జరిగేది కాదు. ఇప్పుడు నేను వెనక్కి తిరిగి ఆలోచిస్తే.. 'అసలు వాళ్లు చెప్పినట్లు ఎందుకు చేశాను. అలా అనుమతి ఇవ్వకుండా ఉండాల్సింది అనిపిస్తుంది. కానీ సినిమా ఇండస్ట్రీలో కామన్. అలా చేయకతప్పదు' అని సమీరా(Sameera Reddy) చెప్పుకొచ్చింది. ఇక బాడీ షేమింగ్ గురించి మాట్లాడుతూ.. 'పిల్లలు పుట్టిన తర్వాత నా శరీరంలో మార్పు వచ్చింది. వెయిట్ గైన్ అవ్వడం వల్ల నా ఆత్మవిశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయాను.. ఆ సమయంలో నెటిజన్స్ నుంచి ఎదురైన విమర్శలు మానసికంగా నన్ను ఆవేదనకు గురి చేశాయి. ఇక రెండోసారి తల్లి అయినప్పుడు మాత్రం నా ఆలోచన విధానాన్ని పూర్తిగా మార్చుకున్నాను.. సోషల్ మీడియాలో నెటిజన్లు ఎంతటి దారుణమైన కామెంట్స్ చేసినా.. ఆ నెగిటివ్ కామెంట్స్ చూస్తే నాకేమీ అనిపించడం లేదు. నేను ప్రస్తుతం న్యూట్రల్ గానే ఉన్నాను'

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com